## నీలగిరి నిత్యపద్యం

మాటనిలుపుకొనుట మహిలోన కష్టంబు
కాలగమనమునది కలసిరాదు
మాటయిచ్చునపుడు మదిలోన యోచించు
త్వరితగతిన నీయ వలదు సుమ్ము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644



**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 32 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | జూలై 31, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**- జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులకు సి.ఎస్. ఆదేశం**

**హైదరాబాద్,జూలై 30 :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన

మిగతా2లో...

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

- సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
- ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
- నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ

**హైదరాబాద్,జూలై 30 :** రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి

మిగతా2లో...





## అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జూలై 30 :** అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

మిగతా2లో...

## వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

**- లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లు**



**న్యూఢిల్లీ,జూలై 30 :** వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్-1971 చట్టంలో మార్పుల కోసం

మిగతా2లో...

## హిందుత్వ అంటే మన జీవనవిధానం

**మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య**



**విజయవాడ,జూలై 30 :** హిందుత్వం అంటే మతం కాదని.. జీవన విధానమని భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. దేశభక్తి సమాజ ఐకృత లోపిస్తే దేశం వెనకపడుతుందని పేర్కొన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'కర్మవీరులారా కదిలి రండి' గీతం ఆవిష్కరణ, విద్యార్థులతో మాటామంతిలో పాల్గొని

మిగతా2లో...

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

**- దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం**
**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ**

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై 30 :** పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల




నిధులతో నూతనంగా నిర్మించిన

మిగతా2లో...

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక



2లో

## నేను విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి?: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ,జూలై 30 :** 2034 వరకు తెలంగాణ సీఎంగా తానే ఉంటానని రేవంత్‌రెడ్డి అన్నారు. ఫిన్లాండ్, జర్మనీ టీచర్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యా యులతో ఆయన సమావేశమై మాట్లాడారు. "నేను విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి? పిల్లలకు అల్పాహారం అందించినందుకు రాజీనా మా చేయాలా? ఐటీఐలను కాకుండా ఏటీసీలను ఏర్పాటు చేసినందుకా? మండలాల్లో విద్యాభి వృద్ధికి ఏం కావాలో ఉపాధ్యాయులు సలహాలు ఇవ్వండి. టీచర్ల సలహాలను అధికారులు అమలు చేస్తారు. విద్యారంగంపై ఖర్చు పెట్టడానికి నాకు ఇబ్బంది లేదు." అని అన్నారు.

## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన**



**హైదరాబాద్ ,జూలై 30 :** తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

మిగతా2లో...

## వర్షాలతో రైతులకు ఊరట

- ఆరుతడి పంటల ప్రోత్సాహానికి చర్యలు
- రైతుల జీవనోపాధికి సంబంధించి పలు సూచనలు
- సిఎంకు సమర్పించిన నివేదికపై చిన్నారెడ్డి వివరణ



**హైదరాబాద్ ,జూలై 30 :** గత మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన నివేదికలోని ముఖ్యాంశాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నివేదికలో తక్షణ, మధ్యకాల, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికలతో పాటు రైతుల జీవనోపాధి పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పశుగ్రాస భద్రత, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అంశాలపై సమగ్ర సిఫార్సులు చేశారు. రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు

మిగతా2లో...

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు.ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది.

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్పిం÷-రక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి? పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షిం చేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన రాష్ట్ర స్థాయి సమగ్ర కార్యాచరణ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి బోధి సెంటర్ లో అందజేశారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం మీడియా సెంటర్ లో నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# వర్షాలతో రైతులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కాగా, జూలై 27 నాటికి 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైనట్లు కమిటీ పేర్కొంది. రాష్ట్రంలోని అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టం కూడా గణనీయంగా పడిపోయినట్లు నివేదికలో వివరించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గినందున, నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను గ్రామాల వారీ కార్యాచరణ ప్రణాళికతో విస్తృతంగా ప్రోత్సహించాలని కమిటీ సూచించింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై రైతులకు అందించాలని సిఫార్సు చేసింది. వరి సాగును నీటి లభ్యత ఆధారంగా పరిమితం చేయడంతో పాటు డ్రిప్, స్పిం÷-రక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో, రిడ్జ్ అండ్ ఫరో, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, భూగర్భ జలాల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని నివేదిక సూచించింది. ఉద్యాన పంటల సాగును విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని కమిటీ అభిప్రాయపడింది. తక్కువ వ్యవధి కూరగాయల సాగు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, పట్టుపరిశ్రమ ఆధారిత సాగును ప్రోత్సహించాలని, డ్రిప్ ఇరిగేషన్, శాశ్వత పందిళ్లు, షేడ్‌నెట్ హౌస్‌లు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు సబ్సిడీలు అందించాలని సూచించింది. పశుసంవర్ధక రంగంలో పశుగ్రాస కొరత తలెత్తకుండా జిల్లా వారీగా పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేయడం, మేత పంటల సాగును విస్తరించడం, సైలేజ్, హే తయారీ, అజోల్లా సాగు, పశుగ్రాస విత్తనాల పంపిణీ, అవసరమైతే పశు శిబిరాల నిర్వహణ, పశువులకు తాగునీటి వసతుల కల్పన వంటి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జలాశయాల్లోని నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించాలని నివేదిక పేర్కొంది. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, శాస్త్రవేత్తలు సమన్వయంతో రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సాంకేతిక సూచనలు నిరంతరం అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటీ సూచించింది. అదేవిధంగా, సేంద్రియ ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, వర్మీ కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు, పంటలు, తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైతే మార్కెట్ జోక్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపాదించిన ఈ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తక్షణమే అమలు చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత, పశుగ్రాస లభ్యత, గ్రామీణ ఉపాధి పరిరక్షణతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత స్థిరంగా నిలబెట్టవచ్చని కమిటీ పేర్కొంది. కార్యాచరణ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని నివేదికలో అంచనా వేసింది.

# గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం

## తయారీదారులను ఆదేశించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

**హైదరాబాద్,జూలై 30 :**గణేశుడు విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణెశిశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణెశిశ్ విగ్రహాలను ప్రతిష్టించినట్లు వివరించారు. విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్రహాల ప్రతిష్టాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. దూల్‌పేట్, జల్‌పల్లి, మైలార్‌దేవ్‌పల్లి నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను నివారించాలని ఆదేశించారు. రవాణాకు ముందు స్థానిక ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలని తయారీదారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లై ఓవర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని



ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉప యోగించే క్రేన్లు, వాహనాలు సర్టి÷డ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయకుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

# వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలాపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

# హిందుత్వ అంటే మన జీవనవిధానం

(మొదటి పేజీ తరువాయి)

వెంకయ్యనాయుడు ప్రసంగించారు. మంచి గీతాలు వినాలని, తద్వారా స్ఫూర్తిని పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. వందేమాతరం గీతం మనందరికీ సమాధానమని తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని సూచించారు. శక్తివంతమైన భారత్ కావాలంటే యువతి, యువకుల పాత్రే కీలకమని ఉద్ఘాటించారు. మొబైల్ ఫోన్, యూట్యూబ్‌లపై యువత ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని చెప్పుకొచ్చారు. యువత మంచి గురువును ఎంచుకోవాలని, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఎక్కువగా చదవాలని సూచించారు. యువత తమ భవిష్యత్తును తామే నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్. పి లతో సి.ఎస్ సంజయ్ జాజు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సి.వీ ఆనంద్, అడిషనల్ డీజీ భగవత్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్నందున జిల్లాల్లో పోలీసు వివిధ శాఖలతో సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రధానంగా, ఆయా జిల్లాలో వాటర్ ఫాల్స్, ప్రమాదకర ప్రదేశాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల కలెక్టర్లు పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తుండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇప్పటికే, ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని, అవసరమైనప్పుడు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

సీసీ రోడ్, లో - లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# మోడీ సోషల్ మీడియా ఇన్ప్లుయెన్సర్‌గా మారాలి

**పుణె,జూలై 30 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు. దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు.

ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పె÷-లలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని అభిజీత్ ఆరోపించారు.

## ఎల్లంపల్లి కాళేశ్వరం ప్రాజెక్టులపై కాంగ్రెస్ విమర్శలు



**గంగాధర, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చొప్పదండి నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్ గురువారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొండగట్టు అంజన్న ఆశీర్వాదంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని, రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి 2004లోనే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారని, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి అక్కడి నుండి గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీటిని తరలించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని గుర్తు చేశారు. 2016లో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందే ఎల్లంపల్లి నుండి నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించారని, కాంగ్రెస్ పాలనలోనే పంటలకు నీటిని విడుదల చేసిన ఘనత ఉందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును అవినీతి ప్రయోజనాల కోసం రూపకల్పన చేసి, వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి విద్యుత్ ఆధారంగా నీటిని ఎత్తిపోసే పరిస్థితి తీసుకువచ్చిందని విమర్శించారు. కాళేశ్వరం పిల్లర్లు దెబ్బతిన్న కారణంగా నీటిని నిల్వ చేయలేకపోతున్నారని, ఎల్లంపల్లి నుంచే వరద కాలువకు నీటిని తరలించవచ్చని తెలిపారు. ప్రాజెక్టులపై అవగాహన లేకుండా మాట్లాడటం బిఆర్ఎస్ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గిరిప్రదక్షిణ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, రైతులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, యువజన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## భారీ వర్షాల కారణంగా ప్రజలకు అప్రమత్తంగా ఉండాలి
### - మున్సిపల్ చైర్మన్ మౌనిక మహేందర్

**ఖానాపూర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదని మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ సూచించారు. కాలనీలలో వరద సమస్యలు, పాత మట్టి ఇళ్లలో నివసించే కుటుంబాలు జాగ్రత్తగా ఉండాలని, వర్షాల కారణంగా గోడలు కూలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పిల్లలు, పెద్దలు విద్యుత్ వైర్లు, స్తంభాలకు దూరంగా ఉండాలని, వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలనీలలో ఏవైనా సమస్యలు ఉంటే మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 8730293005 కు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఉప్పరి పోశెట్టి 9177475055, శానిటేషన్ జవాన్ మానాల శంకర్ 9948045865 ను సంప్రదించాలని సూచించారు.

## విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించిన కౌన్సిలర్ సతీష్



**ఖానాపూర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మున్సిపల్ ఐదో వార్డులో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కౌన్సిలర్ మేష పోచమ్మ సతీష్ వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చి విద్యుత్తును పునరుద్ధరించారు. భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తెలియజేయాలని వార్డు ప్రజలకు సూచించారు.సమస్యపై తక్షణ స్పందనతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో కాలనీవాసులు, యువకులు కౌన్సిలర్ సతీష్ మరియు విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## కడెం ప్రాజెక్టు నుంచి వరద నీటి విడుదల



**ఖానాపూర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో అధికారులు గురువారం ఉదయం 11:50 గంటలకు గేట్లను ఎత్తి వరద నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 4 నుంచి 10వ గేట్ల ద్వారా రెండు అడుగుల నీరు ప్రవహిస్తోంది. ప్రాజెక్టు నీటిమట్టం 694.250 అడుగుల వద్ద ఉండగా, పూర్తి సామర్థ్యం 700 అడుగులు. మొత్తం 18 గేట్లు కలిగిన ఈ ప్రాజెక్టులో అధికారులు అక్కడే ఉండి నీటి ప్రవాహాన్ని పర్యవేక్షిస్తున్నారు.ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జానకి శర్మల ప్రాజెక్టును సందర్శించి భద్రతా చర్యలు, నీటి సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన డీసీసీ ఉపాధ్యక్షులు రాజుర సత్యం



**ఖానాపూర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు కాలనీలలో వరద ముప్పు ఏర్పడింది. ఈ పరిస్థితిని నిర్మల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు, ఖానాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం కాలనీవాసులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు.నిన్న రాత్రి నుండి కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు ఇళ్లలోనే ఇరుక్కు పోయిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. జెసిబి సహాయంతో వరద నీటిని దిగువ ప్రాంతాలకు మళ్లించి కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజాసేవ కోసం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు.భారీ వర్షాన్ని లెక్కచేయకుండా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు కాలనీవాసులు రాజుర సత్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

## వాగు దాటుతూ గిరిజన మహిళ మృతి



**ఖానాపూర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని చమన్‌పెల్లి గ్రామానికి చెందిన పారుబాయి (45) గురువారం పెన్షన్ తీసుకుని తిరుగు ప్రయాణంలో బల్లి వాగు దాటే ప్రయత్నం చేసింది. వాగులో నీటి ప్రవాహం పెరగడంతో ఆమె కొట్టుకుపోయి మృతి చెందింది.తక్షణమే గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం మృతదేహం లభించింది. ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ కేసు వివరాలను విచారిస్తున్నారు. పారుబాయికి ముగ్గురు పిల్లలు, భర్త ఉన్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పారు బాయ్ కుటుంబానికి ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ఏఐయూకేఎస్ డిమాండ్



**ఖానాపూర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారీ వర్షాల కారణంగా బల్లి వాగు దాటుతుండగా మంగళవారం మృతి చెందిన పారు బాయ్ కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్గ్రేషియా చెల్లించాలని ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు నందిరామయ్య డిమాండ్ చేశారు. గతంలో కూడా బల్లి వాగు దాటుతుండగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆయన విమర్శించారు. తక్షణమే బల్లి వాగుపై వంతెన నిర్మించాలని, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ప్రారంభమైన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఇన్‌సర్వీస్ శిక్షణ



**రామడుగు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామడుగు మండలంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఇన్‌సర్వీస్ ట్రైనింగ్ రెండవ విడతలో భాగంగా మూడు రోజులపాటు శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా మండల విద్యాధికారి జిపివి రంగనాథ శర్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న అభ్యసన సామర్థ్యాలను వెలికి తీయాలని, తెలుగు, గణితం, ఇంగ్లీష్ వంటి విషయాల్లో రెమిడేషన్ ప్రోగ్రామ్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేసి విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరచాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు రవీందర్, శ్రీనివాస్, హరిప్రియ పాల్గొన్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ టెండర్‌పై రవీందర్ సింగ్ సంచలన ఆరోపణలు



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రూ.180 కోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల టెండర్‌లో భారీ గోల్‌మాల్ జరిగిందని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపించారు. ఈ టెండర్ వ్యవహారంలో రూ.40--50 కోట్ల వరకు చేతులు మారాయనే అనుమానాలు ఉన్నాయని, కాంట్రాక్టర్లకు అనుకూలంగా కమిషన్ల కోసం వ్యవహరించారని ఆయన విమర్శించారు.జీ ఓ 745 ద్వారా కేటాయించిన నిధుల వినియోగం పారదర్శకంగా జరగలేదని, ఎక్సెస్ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ అదే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం వెనుక అసలు కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో స్మార్ట్ సిటీ పనుల్లో కూడా నిలువు దోపిడీ జరిగిందని ఆరోపిస్తూ, ఇన్స్పెక్షన్ ఛాంబర్లు, డ్రైనేజీ లింకులు లేకుండా పనులు జరిగాయని పేర్కొన్నారు. అదే సంస్థకు మళ్లీ భారీ విలువైన పనులు అప్పగించడం అనుమానాస్పదమని అన్నారు. కాంగ్రెస్--బీజేపీ నేతల కుమ్మక్కు ఉందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రజల తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని సర్దార్ రవీందర్ సింగ్ స్పష్టం చేశారు.

## హరిత గ్రామ నిర్మాణమే లక్ష్యం..

**- వనమహోత్సవంలో సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్**



**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీలో వనమహోత్సవం కార్యక్రమాన్ని గురువారం సర్పంచ్ శ్రీమతి రాజేశ్వరి మల్లేష్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే గ్రామం పచ్చదనంతో కళకళలాడుతుందని అన్నారు. ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ మాట్లాడుతూ.. హరితహారం విజయవంతం కావాలంటే ప్రజలందరూ మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారు కోరారు. గ్రామంలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. గ్రామాన్ని ఆదర్శ హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి ప్రశాంతి పాల్గొని మొక్కలు నాటారు. గ్రామాన్ని హరితమయంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ తరఫున నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సీతారాం, మల్లేష్, ప్రేమలత, తావుర్య, జయందర్, కవిత, మణిపాల్, సీతి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్సై సంతోష్ కుమార్ రెడ్డికి ఘన సన్మానం

**- సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ శుభాకాంక్షలు**



**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలానికి నూతనంగా నియమితులైన ఎస్సై సంతోష్ కుమార్ రెడ్డి గారిని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్రీమతి రాజేశ్వరి మల్లేష్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సై సంతోష్ కుమార్ రెడ్డి సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. పోలీసు--ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని, గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, చట్టాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ చేపట్టే కార్యక్రమాలకు గ్రామపంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్, ఉపసర్పంచ్ హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో మండలంలో ఆదర్శ పోలీసింగ్‌కు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో ఎస్సై విజయవంతంగా కొనసాగాలని, ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ ఆదర్శ అధికారిగా నిలవాలని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సీతారాం, కవిత, మణిపాల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు హరిలాల్, రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## నంద్యాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ మూడు రోజుల జైలు శిక్ష




**నందికొట్కూరు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, ప్రజల ప్రాణాలు మరియు ఆస్తుల భద్రత కోసం ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మద్యం సేవించి ఆటో నడిపిన వ్యక్తి నంద్యాల న్యాయస్థానం ముందు హాజరయ్యాడు.ఈ నెల 28న రాణి మహారాణి సెంటర్ వద్ద జరిగిన తనిఖీల్లో పిక్కిలి వెంకటరమణ (45) మద్యం సేవించి ఆటో నడుపుతూ పట్టుబడ్డాడు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో 396 ఎమ్జ/100 ఎమ్ఎల్ ఆల్కహాల్ ఉన్నట్లు తేలింది. ఇది చట్టపరంగా అనుమతించిన పరిమితిని మించి ఉండటంతో కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.నంద్యాల స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ మద్దెల శ్రీనివాస రెడ్డి విచారణ జరిపి నిందితుడికి మూడు రోజుల సాధారణ కారాగార శిక్ష విధించారు.ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆర్.జి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌తో పాటు ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా అనేక కుటుంబాలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నాయని, భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగుతాయని తెలిపారు.నంద్యాల జిల్లా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, మద్యం సేవించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నడపవద్దని, మద్యం సేవించిన వారికి వాహనం అప్పగించవద్దని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలని, సురక్షిత ప్రయాణమే కుటుంబానికి నిజమైన భరోసా అని స్పష్టం చేశారు.

## రోడ్డును పునర్నిర్మించాలని ఆస్పత్రి రోడ్డుపై నిరసన



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న రోడ్డును వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ భారతీయుడు కోట శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్ కుమార్ మాట్లాడుతూ గుండె జబ్బులతో బాధపడేవారు, కాన్పు కోసం వచ్చే గర్భిణులు ఈ గోతుల రోడ్డుపై ప్రయాణిస్తే ప్రాణాపాయం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ సిటీ పేరుతో వచ్చిన నిధులు ఎటు వెళ్లాయో, నగర అభివృద్ధి ఏమైందో సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. సామాజిక కార్యకర్త అన్నమల్ల సురేష్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీకి సంబంధించిన రూ.20,000 కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. వెంటనే స్పందించి ఆస్పత్రి రోడ్డును పునర్నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గ్రంథాలయం నిర్మాణంపై బీఎస్పీ ఆందోళన




**హుస్నాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మున్సిపాలిటీలో నాలుగేళ్లుగా నిర్మాణం పూర్తి కాకుండా ఉన్న నూతన గ్రంథాలయం పై బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వచ్చిమట్ల రవీందర్ గౌడ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు హయాంలో ఎంపీడీవో ఆఫీస్ వెనుక భాగంలో 50 లక్షల నిధులతో గ్రంథాలయం నిర్మాణం ప్రారంభమైనప్పటికీ, టాయిలెట్లు, ఫెన్సింగ్, ఫర్నిచర్, కరెంటు వైరింగ్ వంటి పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఆయన తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందర్శన సమయంలో అఖిలపక్ష పార్టీలు అదనంగా 30 లక్షల నిధులు కేటాయించాలని కోరినా, ఇప్పటికీ తాత్కాలికంగా అద్దె భవనంలోనే గ్రంథాలయం కొనసాగుతోందని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడే ఈ భవనం ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాలల్లో 40 రోజులు గడిచినా విద్యార్థులకు యూనిఫాంలు ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దేగల వెంకటేష్, వెలుపుల రాజు, ఎలగందుల శంకర్, మారపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ష ప్రభావిత గ్రామాల పర్యటన



**ఖానాపూర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో రాధా రాథోడ్ సుర్జాపూర్, దిలావర్పూర్ గ్రామాలను సందర్శించారు. వర్షాల వల్ల నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి మురికికాలువల్లో బ్లీజింగ్ పౌడర్ వేయాలని ఆదేశించారు. తరువాత మేడంపల్లి గ్రామంలోని సదరమార్ట్‌ను ఎంపీడీవో పరిశీలించారు. ఆనకట్ట వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## రాజీవ్ రహదారిపై పోటెత్తిన వరద నీరు



**పెద్దపల్లి, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగంపల్లి సాయిగార్డెన్ వద్ద రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాజీవ్ రహదారిపై వరద నీరు పోటెత్తింది. అడ్డుగా ఉన్న పైపులను క్రేన్ సహాయంతో తొలగించగా, పోలీసులు వాహనదారులను దారి మళ్లించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పూదరి మహేందర్, అక్కపల్లి సుజాత క్రాంతి, టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, వార్డ్ ఆఫీసర్లు, నాయకులు వునుకొండ రాకేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద తక్షణ చర్యలు చేపట్టాలి సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్ రూరల్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తిగలగుట్టపల్లి రైల్వే బ్రిడ్జి, బొమ్మకల్ ఫ్లైఓవర్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండటంతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గురువారం ప్రత్యక్షంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసు అధికారులకు ట్రాఫిక్ డైవర్షన్‌లు ఏర్పాటు చేసి రహదారులపై వాహనాలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు వాహనాలను నెమ్మదిగా, అప్రమత్తంగా నడపాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అనవసరంగా వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తిగలగుట్టపల్లి రైల్వే బ్రిడ్జి, బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఇన్‌స్పెక్టర్ కె. నిరంజన్ రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వైఖరిపై బీజేవైఎం నిరసన



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉద్యోగ నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వైఖరిని అనుసరిస్తోందని ఆరోపిస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెడ్ల ప్రవీణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేస్తోందని విమర్శించారు. పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్‌లో కూడా యువతను దగా చేశారని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే పూర్తిస్థాయి నోటిఫికేషన్లు విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఎడవెల్లి శశిధర్ రెడ్డి, నక్క ప్రమోద్, గుర్రం వెంకటేష్ గౌడ్, చిక్కుల కిరణ్, గడ్డం అరుణ్, మణిదీప్, రాహుల్ రెడ్డి, జాగిరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సోనూసూద్ జన్మదిన వేడుకలలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సినీ నటుడు సోనూసూద్ జన్మదినం సందర్భంగా గాలిపెల్లి కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వడ్లూరి అశోక్, మీసాల విక్రమ్, మీసాల ఆంజనేయులు, తాండ్ర అక్షిత్, రవి, జస్వంత్ తదితర యువకులు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. సామాజిక వేత్త చిలువేరు శంకర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ సోనూసూద్ సేవా కార్యక్రమాలకు ప్రేరణగా రక్తదానం నిర్వహించామని, యువకులు ముందుకు వచ్చి రక్తదానంలో భాగస్వాములు కావాలని కోరారు. సోనూసూద్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ ఆరోగ్యంగా నిండునూరేళ్లు జీవించాలని అభిమానులు ఆకాంక్షించారు.

## ఆగస్టు 6న ఎస్ఎఫ్ఐ మహాధర్నా విజయవంతం చెయ్యాలని పిలుపు



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు కరీంనగర్‌లో జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6న రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు ఉదయం టిఫిన్ పథకం పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని మహాధర్నాను విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిక్, శ్రీకాంత్, మమత, సహాయ కార్యదర్శులు రాజు, భరత్, రమ్య, దీపిక, నాయకులు నరేష్, లెనిన్, అరవింద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డల్లాస్‌లో మార్మోగిన బీఆర్ఎస్ గళం



**– ప్రవాస తెలంగాణవాదులతో 'మీట్ అండ్ గ్రీట్'లో ఉద్యమ స్ఫూర్తి వెల్లివిరిసింది**

**డల్లాస్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమెరికాలోని డల్లాస్ నగరంలో బీఆర్ఎస్ డల్లాస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వి. ప్రకాష్, విప్లవ గేయకుడు మిట్టపల్లి సురేందర్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జి. లక్ష్మీనర్సింహారెడ్డి హాజరై ప్రవాస తెలంగాణవాదులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో సాగిన పోరాటం, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని వారు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, వ్యవసాయ రంగ పురోగతి, బతుకమ్మ-బోనాల వంటి తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన విధానాన్ని ప్రస్తావించారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చిస్తూ, బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసి తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రవాస తెలంగాణవాదులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్య యాదగిరి, శ్రీనివాస్ సురభి, హరి, లక్ష్మ గూడూరు, రాము మారగొని, సుభాష్ కట్టెగుమ్ములతో పాటు పెద్ద సంఖ్యలో ప్రవాస తెలంగాణవాదులు పాల్గొన్నారు.

## రైతులు స్ప్రింక్లర్ల కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలి..

**– జూలై 31తో గడువు ముగుస్తుంది**

**– మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహా**



**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ స్ప్రింక్లర్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తుల గడువు ఈ నెల 31తో ముగియనున్నందున అర్హులైన రైతులు ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహా గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆమనగల్లు మార్కెట్ యార్డు పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల్, తలకొండపల్లి మండలాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ప్రభుత్వం మొత్తం 400 స్ప్రింక్లర్లను మంజూరు చేసిందని ఆమె తెలిపారు. ఒక్కో మండలానికి 100 చొప్పున స్ప్రింక్లర్లు కేటాయించగా, రైతులు కేవలం రూ.8,700 డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)తో అవసరమైన పత్రాలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నీటి వినియోగాన్ని తగ్గిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు స్ప్రింక్లర్ విధానం ఎంతో ఉపయోగకరమని యాట గీత నర్సింహా పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు సమర్పించాలని కోరారు. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులను స్వీకరించే అవకాశం ఉండదని, అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని కోల్పోకుండా సంబంధిత వ్యవసాయ మార్కెట్ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహా విజ్ఞప్తి చేశారు.

## భారీ వర్షాలతో ఇబ్బందుల్లో ప్రజలు



**ఖానాపూర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఖానాపూర్ మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందపల్లి, సత్తెనపల్లి ప్రధాన రహదారులపై చెట్లు పడిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని పలు వాడల్లో నీరు నిలిచి ఇళ్లలోకి చేరడంతో మున్సిపల్ అధికారులు కట్టలు వేసి నీటిని తొలగించారు. కొన్నిచోట్ల జెసిబి సహాయంతో కాలువలు తవ్వి సమస్యలు పరిష్కరించారు. రైతులు వర్షాల పట్ల సంతోషంగా ఉన్నప్పటికీ, వాగు దాటే ప్రయత్నంలో గిరిజన మహిళ పారుబాయి మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. మైనార్టీ పాఠశాల సమీపంలోని రింకొని వాగు ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. ఖానాపూర్--నిర్మల్ ప్రధాన రహదారిలో సాయిబాబా ఆలయం దగ్గర చెట్లు పడిపోవడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు వెంట వంగి ఉన్న చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో టాటా మ్యాజిక్ వాహనంపై చెట్టు పడడంతో ఒకరు మృతి చెందిన ఘటనను గుర్తుచేసుకుంటూ, ఇకనైనా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సిపి గౌష్ ఆలం



**గంగాధర, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని గంగాధర పోలీస్ స్టేషన్‌ను కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ గురువారం వార్షిక తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు ఎస్సై వంశీకృష్ణ స్వాగతం పలికారు. అనంతరం సాయుధ దళ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్, స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించిన విధులపై సమీక్ష నిర్వహించారు. రికార్డులను సరైన పద్ధతిలో నిర్వహించి, కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సమన్లు, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్, దర్పణ్, సీఈఐఆర్, సీడీఆర్ వంటి అప్లికేషన్‌లను రోజువారీ విధుల్లో విస్తృతంగా వినియోగించాలని ఆయన సూచించారు. ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి పెండింగ్ కేసులపై సమీక్ష జరిపి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను సెక్టార్లుగా విభజించి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్సై వంశీకృష్ణతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గాయత్రి కళాశాలలో బోనాలు, గోరింట సంబరాలు






**పెద్దపల్లి, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లాలోని గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గురువారం బోనాలు, గోరింట సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ అల్లెంకి రజిని శ్రీనివాస్ విచ్చేసి అమ్మవారికి బోనం సమర్పించి పూజలు చేశారు. తెలంగాణలో అత్యంత ప్రాచీన జానపద పండుగగా బోనాలు ప్రత్యేకతను కలిగి ఉంటుందని, మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి తలపై బోనం ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లడం ఈ పండుగ వైభవమని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా గోరింటాకు ఆషాఢమాసంలో మహిళలు చేతులకు అలంకరించుకోవడం ఒక అందమైన సాంప్రదాయం అని, అది చల్లదనాన్ని అందించడమే కాకుండా జీవితం రంగులమయం అవుతుందని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు గోరింటాకు పెట్టుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా గోరింటాకు సంబరాలు



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ హైస్కూల్‌లో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు సంబరాలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. విద్యార్థులు, మాతాజీలు, ఉపాధ్యాయులు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గోరింటాకు ప్రాముఖ్యత, ఆషాఢ మాస విశిష్టత, కుటుంబ విలువల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సంప్రదాయ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకోగా, పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందించడమే లక్ష్యమని ప్రధానాచార్యులు రణదీర్ తెలిపారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మేయర్, డిప్యూటీ మేయర్



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గురువారం నగరంలోని పలు వర్ష ప్రభావిత ప్రాంతాలను పర్యటించారు. కలెక్టరేట్ రోడ్డులోని ప్రధాన మురుగు నీటి కాలువను పరిశీలించి, వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీలోకి ప్రవహించేలా చర్యలు చేపట్టారు. స్థానికంగా ఉండి అధికార సిబ్బందితో ఫుట్‌పాత్ వీప్ హోల్స్ తెరిపించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ లచ్చిరెడ్డి, డిజాస్టర్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



## మానవసేవయే మాధవసేవ ,రక్తదానం మహాదానం శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ శ్రీనివాసులు సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదానం పట్ల అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తం అందించడం ద్వారా నిజమైన మానవసేవ చేయవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు.క్యాన్సర్ బాధితుడికి బి పాజిటివ్ రక్తం అవసరమైన సందర్భంలో మాజీ సైనికుడు శంకర్ వెంటనే స్పందించి రక్తదానం చేయగా, మరో రోగికి ఏ నెగెటివ్ రక్తం అవసరమైనప్పుడు వెంకటేష్ సహకరించారని సంస్థ సభ్యులు అభినందించారు.సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి మాట్లాడుతూ ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని, ఒక్క యూనిట్ రక్తం ఒక ప్రాణాన్ని కాపాడగలదని పేర్కొన్నారు. పెళ్లి రోజు, పుట్టినరోజు వంటి సందర్భాల్లో రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదాతలుగా నిలవవచ్చని అన్నారు. ఇప్పటి వరకు సంస్థ తరపున 2,650 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు.

## గ్రామ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని ఉపసర్పంచ్ విజ్ఞప్తి

**గంగాధర, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు తడి చేతులతో స్విచ్ బోర్డులు, ప్లగ్‌లు, పరికరాలను ముట్టుకోవద్దని, విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దగ్గరగా వెళ్లరాదని, పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు.విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే వెంటనే లైన్మెన్ లేదా విద్యుత్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని, ఇళ్లలోకి నీరు చేరితే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలని, ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు టీవీ, ఫ్రిజ్ వంటి పరికరాల ప్లగ్‌లు తీసివేయాలని హెచ్చరించారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ఉపసర్పంచ్ భీమా ప్రేమ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ




**అమ్రాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండల కేంద్రంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అచ్చంపేట శాసన సభ్యులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎల్లీనో ప్రభావం దృష్ట్యా రైతులకు ముందస్తు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటలపై శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలని ఆయన అన్నారు.అమ్రాబాద్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజల సంక్షేమమే తమ ధ్యేయ ‌మని శాసన సభ్యులు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మండల సర్పంచులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## జానపద విశ్వవిద్యాలయం ఏర్పాటుకై రౌండ్ టేబుల్ సమావేశం



**హుస్నాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జానపద విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ జానపద సకల కళల పరిరక్షణ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు గడిచినా సాంస్కృతిక పాలసీ లేకపో వడం బాధాకరమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.తెలంగాణలో అత్యధిక జానపద కళారూపాలు ఉన్నప్పటికీ ఇప్పటికీ జానపద అకాడమీ, జానపద విశ్వవిద్యాలయం ఏర్పాటు కాలేదని ఆయన విమర్శించారు. అంతరించిపోతున్న కళలను కాపాడి కళాకారుల జీవనోపాధికి భరోసా కల్పించేందుకు, భావితరాలకు సాంస్కృతిక వారసత్వాన్ని అందించేందుకు తక్షణమే అకాడమీ, విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆగస్టు 22న ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా కళాకారులచే ఘనంగా కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**పెద్దపల్లి, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో గత 48 గంటలుగా కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ నేపథ్యంలో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు.గురువారం ఆయన ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. చెరువులు, గోదావరి పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, ముంపుకు గురైన కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని వసతులు కల్పించాలని సూచించారు.వర్షాల కారణంగా దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్ వ్యవస్థలను అత్యవసరంగా పునరుద్ధరించాలని, రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా చూడాలని ఆయన ఆదేశించారు.ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆసిఫ్ అలీకి అభినందనలు తెలిపిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**– ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా ప్రజాసేవలో రాణించాలని ఆకాంక్ష**



**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నూతనంగా నియమితులైన ఆసిఫ్ అలీ గారిని తెలంగాణ రాష్ట్ర టాస్క్ సి.ఓ.ఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆసిఫ్ అలీకి లభించిన ఈ బాధ్యత ఆయన ప్రజాసేవకు గుర్తింపేనని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన సమర్థవంతంగా పనిచేసి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా స్థానిక సంస్థల ఆర్థిక అవసరాలపై సమగ్ర దృష్టి సారించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమర్థవంతమైన సూచనలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ రాష్ట్రాభివృద్ధికి తనవంతు సేవలు అందించాలని కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ నిబద్ధతతో విధులు నిర్వహించాలని, ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాల సాధనలో తనవంతు పాత్ర పోషించాలని సూచించారు. నూతన బాధ్యతల్లో ఆసిఫ్ అలీ విజయవంతంగా కొనసాగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్ పాల్గొని ఆసిఫ్ అలీకి శుభాకాంక్షలు తెలిపారు.

## రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

**– సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్**
**– మేడిగడ్డ తాండలో ఘనంగా సివిల్ రైట్స్ డే..**



**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీలో సివిల్ రైట్స్ డే (పౌర హక్కుల దినోత్సవం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి రాజేశ్వరి మల్లేష్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎస్సై సంతోష్ కుమార్ రెడ్డి, ఉప తహసీల్దార్ వినోద్ కుమార్, ఆర్ఐ సంపత్ హాజరై రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు, సామాజిక సమానత్వం, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు విధులను కూడా బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ మాట్లాడుతూ గ్రామస్థులందరూ రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ సమానత్వ భావనతో జీవించాలని కోరారు. ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్ మాట్లాడుతూ హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతలను ప్రతి ఒక్కరూ నిర్వర్తించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీఓ మానిల, గ్రామ కార్యదర్శి ప్రశాంతి, వార్డు సభ్యులు సీతారాం, కవిత, మణిపాల్, నాయకులు హరి లాల్, శ్రీను, కుమార్, నరేష్, పవన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గౌరారం సీసీ రోడ్డుకు శాశ్వత పరిష్కారం కల్పించాలి

**– ప్రజల ఇబ్బందులను వెంటనే నివారించాలి**
**– బీఆర్ఎస్ నాయకులు వెంకటాపురం శివ**



**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గౌరారం గ్రామంలో దెబ్బతిన్న సీసీ రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు వెంకటాపురం శివ అన్నారు. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డు సమతలంగా లేకపోవడంతో నీరు నిలిచిపోయి బురదమయంగా మారు తుండటంతో గ్రామస్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ఇళ్ల ముందు వరకు వర్షపు నీరు చేరడంతో స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకా రంతో ప్రత్యేక నిధులు మంజూరు చేసి నూ తన సీసీ రోడ్డు నిర్మించాలని, గ్రామ ప్రజల విజ్ఞప్తిని సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి పరిగణనలోకి తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని వెంకటాపురం శివ విజ్ఞప్తి చేశారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ఈ రహదారి నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం



**– సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా జాబ్ డ్రైవ్‌లను నిర్వహిస్తున్నామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. గురువారం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహించిన జాబ్ డ్రైవ్--ఇంటర్వ్యూ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత తమ విద్యతో పాటు నైపుణ్యాలను కూడా పెంపొందించుకుని ప్రతి ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగం ఒక వ్యక్తి జీవితాన్నే కాదు, ఒక కుటుంబ భవిష్యత్తును కూడా మార్చగలదని పేర్కొన్నారు. అందుకే యువతకు ఉపాధి కల్పించేందుకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి జాబ్ డ్రైవ్‌లను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో లభించే అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "యువతకు ఉద్యోగం -- కుటుంబానికి భరోసా -- సమాజానికి అభివృద్ధి" అనే లక్ష్యంతో నిర్వహి ంచిన ఈ ఇంట ర్వ్యూలకు కల్వకుర్తి మండలం నుంచి 7 మంది, ఆమనగల్లు మండలం నుంచి 4 మంది, తలకొండపల్లి మండలం నుంచి 5 మంది, కడ్తాల్ మండలం నుంచి 5 మంది చొప్పున మొత్తం 21 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వీర, శ్రీనివాస్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పాల్గొని అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు.

## విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు, స్తంభాలకు ప్రమాదకరంగా మారిన చెట్లను, కొమ్మలను తొలగించే కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రావు మాట్లాడుతూ ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా షార్ట్ సర్క్యూట్లు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో ప్రమాదకర చెట్ల కొమ్మలను తొలగించామని, డివిజన్‌లో విద్యుత్ సమస్యలు లేదా ప్రమాదకర పరిస్థితులు ఎక్కడైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్, విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక బీజేపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా తోట సమ్మయ్య నియామకం



**హుస్నాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా హుస్నాబాద్‌కు చెందిన తోట సమ్మయ్య నియమితు లయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఇతర రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపార .కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రజినీకర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి, రైతుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని సమ్మయ్య పేర్కొన్నారు. తనతో పాటు నియమితులైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ పిలుపు



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.రైల్వే స్టేషన్ వద్ద హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ స్వాతంత్ర్య ఉద్యమం నుంచే కార్మిక హక్కుల కోసం పోరాడుతూ వస్తోందని, బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి హక్కులను హరిస్తోందని, దీనిని తిప్పికొట్టాలంటే కార్మికులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.కరీంనగర్‌లో జరిగే మహాసభలు విజయవంతం చేయడం ప్రతి కార్మికుని బాధ్యత అని, ఏఐటీయూసీ ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, సిపిఐ నాయకులు బోయిని అశోక్, హమాలీ సంఘం అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మయ్య, ఇతర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## భారీ చోరీ కేసులో మరో నిందితురాలు అరెస్ట్




**కరీంనగర్ రూరల్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇటీవల జరిగిన భారీ చోరీ కేసులో ప్రధాన నిందితుడు తగరం శంకర్‌ను అరెస్ట్ చేసిన రూరల్ పోలీసులు, గురువారం మరో నిందితురాలు ఆడెపు రేష్మాను అదుపులోకి తీసుకున్నారు. తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా ఆమెను పట్టుకుని విచారించగా, తగరం శంకర్‌తో కలిసి ఫారెస్ట్ అధికారి శ్రీనివాస్ ఇంట్లో దొంగతనం చేసినట్లు అంగీకరించింది. ఇంటి తాళాలు పగులగొట్టి రూ.26 లక్షల నగదు అపహరించినట్లు తెలిపింది.తగరం శంకర్‌తో నిరంతరం మాట్లాడేందుకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.ఈ కేసులో మిగిలిన అంశాలపై దర్యాప్తు కొనసాగు తున్నదని రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి వెల్లడించారు.

## కళాకారుల ఆధ్వర్యంలో బోనాల జాతర పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ కళాకారుల ఆధ్వర్యంలో ఆగస్టు 5న జరగనున్న బోనాల జాతర పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు గీతాభవన్, తెలంగాణ చౌక్ నుంచి బోనాల ర్యాలీ ప్రారంభమై కోతిరంపూర్ పోచమ్మ ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆట--పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని బోనాల జాతరను విజయవంతం చేయాలని మేయర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గోగుల ప్రసాద్, బాబు గౌరవేణి, సంతోష్ తమ్మిశెట్టి, అభినవ్ కొత్తకొండ, తిప్పబత్తిని రవి, చిలివేరి శ్రీకాంత్, యతిరాజు, దేవరాయ శ్రీనివాస్, దాసం అజయ్, సంద స్వప్న, గాజుల ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## 19వ రోజుకు చేరిన విద్యుత్ ఉద్యోగుల నిరసన




కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాలను ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగులు (టిజి పిఈ జెఎసి) 19వ రోజు కూడా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాధించిన తర్వాత విద్యుత్ సరఫరా కోసం ఇంజనీర్లు, ఉద్యోగులు కష్టపడి పనిచేశారని, కానీ మేనేజ్మెంట్ మాత్రం ప్రైవేటుపరంపు వైఖరిని అనుసరిస్తోందని విమర్శించారు. గత 40 రోజులుగా నిరసనలు జరుగుతున్నప్పటికీ టెండర్లు రద్దు చేయకపోవడం దుర్మార్గమని, మొండి వైఖరి కొనసాగితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యాలయ ప్రాంగణంలో ప్రైవేటైజేషన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణారావు, మహేందర్ రావు, శ్రీనివాస్, రఘు, రాజు, సంపత్ కుమార్, సంతోష్, రంగు వెంకటనారాయణ, యుగంధర్, రాచకొండ శ్రీనివాస్, నిఖిల్ మరియు పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సఖి సెంటర్‌ను సందర్శించిన మండల అభివృద్ధి అధికారులు



కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లాలోని అన్ని మండల అభివృద్ధి అధికారులు ప్రజా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓ పవన్ ఆధ్వర్యంలో సఖి సెంటర్‌ను సందర్శించారు .సఖి వన్ స్టాప్ సెంటర్ ద్వారా హింసకు గురైన మహిళలు, బాలికలకు అందించే తాత్కాలిక షెల్టర్, కౌన్సిలింగ్, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సహాయం, అత్యవసర సేవలపై అధికారులు వివరాలు తెలుసుకున్నారు. మహిళా హెల్ప్‌లైన్ 181 ద్వారా అందించే సేవలను సఖి సిబ్బంది వివరించారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి వివరించారు. ఈ కార్యక్ర మంలో సఖి నిర్వాహకురాలు ఐసీడీఎస్ అర్బన్ సిడిపిఓ కవిత, దామెర లక్ష్మి, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా కళాశాలలో ప్రారంభమైన మెషిన్ లెర్నింగ్ వర్క్‌షాప్




కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల (అటానమస్), కరీంనగర్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో, శాతవాహన విశ్వవిద్యాలయం సహకారంతో "మెషిన్ లెర్నింగ్ విత్ పైథాన్" అంశంపై మూడు రోజుల హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, పైథాన్ ప్రోగ్రామింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ప్రాయోగికంగా నేర్చుకోవాలని సూచించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ శ్రీ రంగ ప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో మెషిన్ లెర్నింగ్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని, విద్యార్థులు పరిశోధన, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. డా. శ్రీనివాస్ మాట్లాడుతూ శిక్షణలో డేటా ప్రీ-ప్రాసెసింగ్, విజువలైజేషన్, సూపర్వైజ్డ్ & అన్‌సూపర్వైజ్డ్ లెర్నింగ్, మోడల్ బిల్డింగ్, ఇవాల్యుయేషన్, ప్రాక్టికల్ సెషన్స్, మినీ ప్రాజెక్ట్ వంటి అంశాలపై నిపుణులు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. ఎ. కల్పన, జి. శ్రీనివాస్ రెడ్డి, మనోజ్ కుమార్, అధ్యాపకులు హరికృష్ణ, కిషోర్, సుప్రియ, సరిత, స్వర్ణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన సదస్సు



కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రపంచ మానవ అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాల ఆరెపల్లిలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇప్పటికీ అక్రమ రవాణా జరుగుతుందని, అమ్మాయిలను ప్రేమ పేరుతో మోసం చేయడం, అబ్బాయిలను మత్తు పదార్థాలకు బానిస చేసి విదేశాలకు అక్రమ రవాణా చేస్తున్నారని హెచ్చరించారు. పిల్లలు జాగ్రత్తగా ఉండాలని, ఫోన్‌తో సమయం వృథా చేయకుండా ఆటలు ఆడి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ అజ్మల సంపత్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం శ్రీలత, కమ్యూనిటీ కోఆర్డినేటర్ తిరుపతి, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. డిబోరా కృపారాణి, ఎఎన్ఎం మల్లేశం, షీ టీం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతు హక్కులపై అవగాహనే నష్టాలకు చెక్

- ఆమనగల్లు కూరగాయల మార్కెట్‌లో ప్రత్యేక అవగాహన ఫ్లెక్సీ ఏర్పాటు



ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రైతులు తమ హక్కులను తెలుసుకుని వ్యవసాయ మార్కెట్ చట్టాలకు అనుగుణంగా పంట ఉత్పత్తులను విక్రయించాలనే ఉద్దేశంతో ఆమనగల్లు కూరగాయల మోండా మార్కెట్ వద్ద ప్రత్యేక అవగాహన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రైతులు మార్కెట్ వ్యవస్థ, విక్రయ విధానాలు, చట్టపరమైన హక్కులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉంటే ఆర్థిక నష్టాలను నివారించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఫ్లెక్సీలో రైతులు తాము పండించిన కూరగాయలను మార్కెట్ నిబంధనల మేరకు నేరుగా విక్రయించే అవకాశాలు, చట్టబద్ధంగా వ్యాపారం నిర్వహించే విధానాలపై వివరించారు. అలాగే మార్కెట్‌లో వ్యాపారం నిర్వహించే ట్రేడ్ కమిషన్ ఏజెంట్లు సంబంధిత లైసెన్స్ కలిగి ఉండాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. రైతులు తమ హక్కులను తెలుసుకుని పారదర్శకంగా లావాదేవీలు నిర్వహించాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ మార్కెట్ అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ, న్యాయమైన మార్కెట్ వ్యవస్థ బలోపేతానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఘనంగా అమరజీవి గట్టి కొప్పుల రామిరెడ్డి వర్ధంతి



మిర్యాలగూడ, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సిపిఎం సీనియర్ నాయకుడు అమరజీవి కామ్రేడ్ గట్టి కొప్పుల రామిరెడ్డి గారి ఏడవ వర్ధంతి సందర్భంగా తడకమళ్ళ గ్రామంలోని వారి స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, "రైతాంగ పోరాటంలో రామిరెడ్డి చేసిన త్యాగాలు, ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తి. ఆయన ఆత్మస్ఫూర్తి ఎప్పటికీ మాకు మార్గదర్శకంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.

## రేషన్ షాపుల వద్ద బారీ క్యూ లైన్లు



బోడుప్పల్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బోడుప్పల్ పరిధిలోని ప్రతి రేషన్ దుకాణం వద్ద ఈరోజు జనాలు బారులు తీరారు. కేవైసీ చివరి తేదీ దగ్గరపడటంతో రేషన్ కార్డుదారులు ఒక్కసారిగా భారీ క్యూ లైన్లలో నిలబడ్డారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కేవైసీ చేయించేందుకు పెద్ద సంఖ్యలో వచ్చారు. "ఆగస్టు నెల నుండి రేషన్ పొందాలంటే తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేయాలి" అని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు తొందరగా కే వై సీ చేయించుకుంటున్నారు. రేషన్ కార్డుదారులు మాట్లాడుతూ, "ప్రభుత్వం మరికొంత సమయం ఇస్తే ఇబ్బందులు తక్కువయ్యేవి" అని అభిప్రాయపడ్డారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే ప్రత్యేక కార్యాచరణ అవసరం మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్




వెల్దండ, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన ఎల్‌నినో ప్రభావంపై అవగాహన సదస్సులో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. అందువల్ల రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి. పంట మార్పిడి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చు" అని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు సమస్యల పరిష్కారంలో భాగంగా, తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహించడం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సులోచన, మండల వ్యవసాయాధికారి శోభ రాణి, ఏఈఓ రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరి, ఉప సర్పంచ్ బస్వమోని శ్రీనివాస్, గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ప్రవాస అభియాన్ ఓటర్ వెరిఫికేషన్



దేవరకొండ జూలై 30.(నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :చింది మండలం కేంద్రం, మరియు, కాంపల్లి, కందుకూరు గ్రామాలో ఎస్ ఐ ఆర్ ప్రవాస అభియాన్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమము బిజెపి సీనియర్ నాయకులు మాజీ నల్గొండ పార్లమెంట్ కన్వీనర్ ( మండల ఇంచార్జ్) నక్క వెంకటేష్ యాదవ్ పర్యవేక్షణలో బూత్ నంబర్176, 177,150,151,152,153,198,199,లో వెరిఫికేషన్ చేశారు.మండల అధ్యక్షులు సింగారం సైదా (బి ఎల్ ఏ2)అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో బిజెపి సీనియర్ నాయకులు ఎలకుర్తి జైపాల్, ఎలకుర్తి రమేష్ జిల్లా కౌన్సిల్ సభ్యులు, వావిళ్ళ అంజి యాదవ్ వార్డు మెంబర్, అమృత ముబిరాజ్ టౌన్ ప్రెసిడెంట్ సాయి గౌడ్ గాయాల రాఘవేంద్ర (బి ఎల్ ఏ2)సాయి యాదవ్ వావిళ్ళ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలో అర్హులైన విద్యార్థులకు సీట్లు కేటాయించాలి



హైదరాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజా హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుగమల్ల షాలెమ్ రాజు హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య భవన్‌లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల సెక్రటరీ కంభంపాటి శారదను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినప్పటికీ అనేక మంది విద్యార్థులకు ఇప్పటివరకు సీట్లు కేటాయించబడలేదు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా ఈ జాబితాలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది" అని తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను పారదర్శకంగా ప్రకటించి, అర్హత మరియు మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "విద్య ప్రతి విద్యార్థి హక్కు అర్హులైన ఒక్క విద్యార్థి కూడా అవకాశం కోల్పోకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి" అని షాలెమ్ రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా హక్కుల సాధన సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలకుంట్ల వినోద్ చారి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరద నీటి సమస్యపై చర్యలు చేపట్టిన మున్సిపల్ చైర్మన్



సుల్తానాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా 7వ వార్డులో ఏర్పడిన వరద నీటి సమస్యపై సమాచారం అందిన వెంటనే మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ స్వయంగా పర్యటించారు. లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా జేసీబీ సహాయంతో కాలువలను శుభ్రం చేయించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ రమేష్, 7వ వార్డు కౌన్సిలర్ పూల్ల వరప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే వార్డు కౌన్సిలర్ లేదా మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత ఆరేపల్లి రాజయ్య



సుల్తానాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ హితమైన అలవాట్లను అలవరచుకోవాలని మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య సూచించారు. జడ్పీహెచ్ఎస్ గర్రెపల్లిలో మూడు రోజులపాటు జరుగుతున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని, వారు ఆచరించే మంచి అలవాట్లను విద్యార్థులు, తల్లిదండ్రులు అనుసరిస్తారని తెలిపారు. స్టీల్ ప్లేట్లతో భోజనం చేసిన ఉపాధ్యాయుల చర్యను అభినందిస్తూ, ప్లాస్టిక్‌కు బదులుగా పునర్వినియోగ వస్తువులను వినియోగించాలని సూచించారు. చిన్న చిన్న మార్పులే భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందిస్తాయని, అందరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## చిల్డ్రన్స్ హోమ్‌లో పిల్లల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్



సుల్తానాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మార్కండేయ కాలనీలోని చిల్డ్రన్స్ హోమ్‌ను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పుష్పలత గురువారం సందర్శించారు. ఇటీవల ఇద్దరు బాలికలు పారిపోయిన ఘటనపై వివరాలు తెలుసుకుని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. పిల్లలకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మెనూను పరిశీలించిన ఆమె, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. బాలబాలికల ఆరోగ్యం, విద్య, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ చింతల రాజు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన సిటీ బస్ సర్వీసులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందించాలనే లక్ష్యంతో చింతకుంట, కొత్తపల్లి, హవేలీ, వాగేశ్వరి కాలనీలకు నూతన సిటీ బస్ సర్వీసులు గురువారం ప్రారంభమయ్యాయి. రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కోలగాని శ్రీనివాస్ కలిసి బస్సులకు జెండా ఊపి సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నగరంతో పాటు శివారు ప్రాంతాల ప్రజలకు సురక్షితమైన, అందుబాటులో ఉండే ప్రజా రవాణా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కొత్త మార్గాల్లో సిటీ బస్సులు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ సులభంగా ప్రయాణించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ కుమార్ దేశాయ్, మున్నూరు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఎన్సిసి క్యాంప్



కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఎన్సిసి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎన్సిసి అధికారులు విద్యార్థులకు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం జీవితంలో అత్యున్నత గౌరవమని గుర్తుచేశారు. ఎన్సిసి కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తి, సేవాస్ఫూర్తి వంటి విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర, గ్రూప్, డైరెక్టరేట్ స్థాయి కఠినమైన ఎంపిక శిబిరాలను విజయవంతంగా పూర్తి చేసిన క్యాడెట్లకే ఢిల్లీ పరేడ్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఎన్సిసి అధికారులు సూచించిన విధివిధానాలను పాటించి అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ కృష్ణమూర్తి, హవిల్దార్ దేవేంద్ర సింగ్, సుబేదార్ జంగ్ బాజ్ ఖాన్, సుబేదార్ సునీల్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులకు అండగా నిలిచిన ప్రజాప్రతినిధులు



**సుల్తానాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వల లక్ష్మి--రాజయ్య వృద్ధ దంపతులు పిల్లల నిర్లక్ష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిన సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, కౌన్సిలర్లు వెంటనే స్పందించారు. వర్షాలతో శిథిలావస్థలో ఉన్న వారి ఇల్లు ప్రమాదకరంగా మారడంతో, వృద్ధులను స్వయంగా పరామర్శించి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో సురక్షితంగా చేర్పించారు. కన్నవారు దూరం చేసిన చోట ప్రజాప్రతినిధులు బిడ్డల్లా అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని స్థానికులు ప్రశంసించారు. వృద్ధులు, నిరుపేదలకు ఎల్లప్పుడూ సహాయం అందిస్తామని మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు హామీ ఇచ్చారు. ఈ ఘటన స్థానికంగా అందరి హృదయాలను కదిలించింది.

# విద్యుత్ లైన్మన్ నంబర్లు మార్పు

**కరీంనగర్ రూరల్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తపల్లి మండల ప్రధాన కార్యాలయం ఎన్‌పిడిసిఎల్ లైన్‌మ్యాన్ సంప్రదింపు నంబర్ 8712483217 గా, ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్ 8712488944 గా మార్చబడింది. వినియోగదారులందరూ తమ సంప్రదింపు వివరాలను నవీకరించుకోవాలని కొత్తపల్లి ఆపరేషన్స్ ఏఈ తెలిపారు.

# ఆగస్టు 1న ఉపాధ్యాయులకు బాలల హక్కులపై శిక్షణ సదస్సు



**కరీంనగర్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్ తెలిపారు బాలల హక్కులు, భద్రత, సంక్షేమంపై అవగాహన కల్పించేందుకు ఆగస్టు 1న ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలల చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నామినేట్ అయిన ఉపాధ్యాయులకు ఈ శిక్షణ జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో జరగనుంది. బాలలపై వేధింపులు, లైంగిక దాడులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నివారణ చర్యలతో పాటు ఉచిత న్యాయ సేవలపై నిపుణులు అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో న్యాయాధికారులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, న్యాయ సేవా వాలంటీర్లు పాల్గొననున్నారు. ఎంపికైన ప్రతినిధులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోరారు.

# అకుతోటపల్లి క్వారీ ఫిర్యాదుపై కలెక్టర్ స్పందన..

**- జూలై 31న సంయుక్త తనిఖీలు**



**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అకుతోటపల్లి గ్రామంలోని సర్వే నెం.304లో ప్రతిపాదిత క్వారీలు, స్టోన్ క్రషర్ ఏర్పాటుపై గ్రామ ప్రజలు, రైతులు సమర్పించిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం స్పందించారు. ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖలు సంయుక్తంగా స్థల తనిఖీలు నిర్వహించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గనులు ఒ భూగర్భశాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, తహసీల్దార్ కార్యాలయ అధికారులు కలిసి జూలై 31, 2026 ఉదయం 10:30 గంటలకు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించనున్నారు. తనిఖీల అనంతరం నివేదికను జిల్లా యంత్రాంగానికి అందజేయనున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, ప్రతిపాదిత క్వారీ ప్రాంతానికి సమీపంలో ఉన్న పాఠశాలకు సుమారు 1.5 కిలోమీటర్ల దూరంలో గనుల కార్యకలాపాలు చేపట్టడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా వాతావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు. అలాగే బ్లాస్టింగ్, స్టోన్ క్రషింగ్, భారీ లారీల రాకపోకల కారణంగా దుమ్ము, శబ్ద కాలుష్యం పెరగడంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా అధికమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంయుక్త తనిఖీల అనంతరం సమర్పించే నివేదిక ఆధారంగా జిల్లా యంత్రాంగం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# వైద్య విద్యకు విశిష్ట సేవలు.. డాక్టర్ నరేందర్ కుమార్‌కు ఘన వీడ్కోలు

**- పదవీ విరమణ సందర్భంగా సేవలను కొనియాడిన టీజీజీడీఏ**




**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వైద్య విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఎ. నరేందర్ కుమార్ గురువారం పదవీ విరమణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలిపింది. వైద్య విద్యాభివృద్ధి, ప్రభుత్వ వైద్య సేవల బలోపేతంలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని సంఘం పేర్కొంది. నిజాయితీ, పారదర్శకత, ప్రజాసేవ పట్ల అంకితభావంతో ఆయన వైద్య రంగంలో ఆదర్శవంతమైన అధికారిగా నిలిచారని కొనియాడింది. వైద్యులు, వైద్య విద్యార్థుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలు, అందరికీ అందుబాటులో ఉండే నాయకత్వం వైద్య సమాజం మన్ననలు పొందాయని తెలిపింది. వైద్య విద్యాశాఖ సంచాలకులుగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల అభివృద్ధికి విశేషంగా కృషి చేయడంతో పాటు వైద్య విద్యా ప్రమాణాల పెంపునకు కీలక పాత్ర పోషించారని పేర్కొంది. ప్రభుత్వ వైద్యులకు అందించిన మార్గదర్శకత్వం, సహకారం చిరస్మరణీయమని సంఘం తెలిపింది. డాక్టర్ ఎ. నరేందర్ కుమార్ అందించిన విశిష్ట సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని టీజీజీడీఏ ఆకాంక్షించింది.

# బాలల విజ్ఞాన కాంగ్రెస్‌లో విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొనాలి



**నాగర్‌కర్నూల్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ ప్రకటించిన ప్రకారం, జాతీయ బాలల విజ్ఞాన కాంగ్రెస్--2026లో ప్రతి పాఠశాల తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఆగస్టు 15లోపు ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది ప్రధాన అంశం స్థిరత్వం కోసం విజ్ఞానం మరియు ఆవిష్కరణగా ఎంపిక చేశారు. విద్యార్థులు వ్యర్థాల నిర్వహణ, శక్తి, నీటి సంరక్షణ, ఆహారం--వ్యవసాయం--ఆరోగ్యం, భారతీయ సాంప్రదాయ జ్ఞాన వ్యవస్థలపై వినూత్న ప్రాజెక్టులు రూపొందించవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి కనీసం ఒక ప్రాజెక్టు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, విద్యార్థుల ప్రతిభను జాతీయ స్థాయిలో చాటేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో సూచించారు. సాంకేతిక సందేహాల కోసం జిల్లా సైన్స్ అధికారి టి. రాజశేఖర్ రావు 6302538858 లేదా జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ చాంద్ పాషా 9100876190ను సంప్రదించవచ్చని తెలిపారు.

# ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

**- బీఎల్‌ఓ-2లకు దిశానిర్దేశం చేసిన జమలాపురం రాంకిషన్**



**ఆమనగల్లు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు నమోదు అయ్యేలా బీఎల్‌ఓ-2లు బాధ్యతాయుతంగా పనిచేయాలని కల్వకుర్తి అసెంబ్లీ బీఎల్‌ఏ-1 ఇన్‌చార్జ్ జమలాపురం రాంకిషన్ సూచించారు. బీజేపీ అమనగల్లు మండల అధ్యక్షుడు ఎరవోలు శ్రీనివాస్ కేకే ముదిరాజ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల ప్రవాస్ అభియాన్‌లో భాగంగా బీఎల్‌ఓ-2ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ ప్రతి ఇంటిని సందర్శించి కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను గుర్తించి సంబంధిత అధికారులకు అందించాలని సూచించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పుల్లేకుండా సిద్ధమైతేనే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం 182, 183, 190, 191, 202, 203, 208, 209, 210, 212 బూత్‌లకు చెందిన బీఎల్‌ఓ-2లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహించి ఇంటింటి సర్వే, దరఖాస్తుల స్వీకరణ, ఓటరు జాబితా సవరణలో ఎదురవుతున్న అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అమనగల్లు రూరల్ మండల అధ్యక్షుడు ఎరవోలు శ్రీనివాస్ కేకే ముదిరాజ్ మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సవరణ ప్రక్రియ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరేటి నరసింహ, మంగళపల్లి గ్రామ సర్పంచ్ కారంటోతు మౌనిక శివ, వరికుప్పల శ్రీనివాస్, గండికోట జంగయ్య, మొగిలమని శ్రీశైలం యాదవ్, కొప్పు వెంకటయ్య, ఓర్సు వెంకటేష్, వరికుప్పల యాదయ్య, ఓర్సు శివ, జంపరాతి మహేష్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ సంకల్పం : ఎమ్మెల్యే బీఎల్ఆర్



**మిర్యాలగూడ, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఈరోజు ఉదయం మండల విద్యాశాఖాధికారితో కలిసి శ్రీనివాస్ నగర్‌లోని ఎంజేపీటీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ ను సందర్శించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి టీచర్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యా బోధన, సిబ్బంది సమస్యలు, మౌలిక వసతుల అవసరాలపై ఉపాధ్యాయుల అభిప్రాయాలను తెలుసుకుని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. తరువాత విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై వారి విద్యాభ్యాసం, హాస్టల్ వసతులు, ఆహారం, తాగునీరు, పరిశుభ్రత వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. "ప్రజా ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. చదువు ఒక్కటే మన స్థితిగతులను మార్చగలదు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలి" అని ఎమ్మెల్యే బీఎల్ఆర్ అన్నారు. ఆగస్టు 15 వరకు ప్రతిరోజూ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను స్వయంగా సందర్శించి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉదయం అసెంబ్లీలో విద్యార్థులతో కలిసి పాల్గొని వారికి విద్య ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫామ్‌లను పంపిణీ చేసి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం - జిల్లా కలెక్టర్



**నాగర్‌కర్నూల్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సర్వసభ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి పంట సాగు చేయకుండా, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు -- కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు -- సాగు చేయాలని ఆయన సూచించారు. "వాతావరణ శాఖ హెచ్చరికలను నిర్లక్ష్యం చేయరాదు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటే రైతులు నష్టాలను నివారించడంతో పాటు ఆదాయాన్ని పెంచుకోవచ్చు" అని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపవచ్చని ఆయన పేర్కొన్నారు. నీటి సంరక్షణలో భాగంగా చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతలు, రీచార్జ్ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని, భూగర్భ జలాలను విచక్షణారహితంగా వినియోగిస్తే భవిష్యత్తులో తాగునీటి సమస్యలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వనపట్ల గ్రామం ఆదర్శంగా నిలవడాన్ని అభినందిస్తూ, అదే స్ఫూర్తితో ఇతర గ్రామాల్లో కూడా నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. రెండో దశ ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల వివరాలను ముందుగానే సిద్ధం చేసి, మొదటి దశలో అవకాశం కోల్పోయిన వారికి న్యాయం జరగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, ఉపాధి అంశాలకు సర్పంచులు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా గ్రామ పాలన ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ అర్చన, ఎంపీడీవో చెన్నమ్మ, ఎంఈఓ కురుమయ్య, వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దేవరకొండలో ప్రతి వార్డు అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**దేవరకొండ జూలై 30.(నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, దేవరకొండ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతున్నామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. పట్టణంలోని 1, 2, 3 వార్డుల పరిధిలో ఖిల్లా బజార్, బొడ్రాయి బజారు, పాత పోలీస్ స్టేషన్, మసీదు ముందు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులనుఅలాగే ముత్యాలమ్మ బజారులో నిర్మిస్తున్న మురికి కాలువల పనులను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకుని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులోగా అత్యున్నత నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూదేవరకొండ మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అప్పగిస్తే పట్టణ అభివృద్ధి మరింత వేగంగా, మరింత సులభంగా జరుగుతుందని ఎన్నికల సమయంలో ప్రజలకు మాట ఇచ్చాం. ప్రతి వార్డులో, ప్రతి కాలనీలో నాణ్యమైన సీసీ రోడ్లు, మురికి కాలువలు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఈరోజు ఆ మాటలను చేతల్లో చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటోంది. ఇది మాటల ప్రభుత్వం కాదు... పనులతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్న ప్రభుత్వం అని అన్నారు. ప్రజల అవసరాలే అభివృద్ధి ప్రణాళికలకు ప్రాతిపదికగా తీసుకుని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులుకొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ, ప్రజలకు మెరుగైన జీవన వాతావరణాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. దేవరకొండ పట్టణంలో కూడా అదే దిశగా సీసీ రోడ్లు, మురికి కాలువలు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజాధనం ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ-వెంకటేశ్వర్లు నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎం.ఎ. సిరాజ్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు వెంకటేష్ గౌడ్ పార్టీ సీనియర్ నాయకులు నజీర్ అహ్మద్, మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ సంబంధిత శాఖల అధికారులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం అధికారికి జరిమానా



**హైదరాబాద్, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమాచార హక్కు చట్టం--2005 అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రజా సమాచార అధికారిపై తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కఠిన చర్యలు తీసుకుంది. చట్టం నిర్దేశించిన గడువులోగా సమాచారాన్ని అందించకపోవడంతో సంబంధిత అధికారికి రూ.10,000 జరిమానా విధిస్తూ కమిషనర్ మొహ్సిన్ పర్వీన్ ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని పోల్కంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహానికి సంబంధించిన సమాచారాన్ని కోరినప్పటికీ, 30 రోజుల గడువులోగా అందించకపోవడంతో ద్వితీయ అప్పీల్ దాఖలైంది. విచారణలో ప్రజా సమాచార అధికారి నిర్లక్ష్య ధోరణిపై కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జరిమానా మొత్తాన్ని వారం రోజుల్లో చెల్లించడంతో పాటు, అప్పీలుదారు కోరిన పూర్తి సమాచారాన్ని ఆలస్యం లేకుండా అందజేయాలని కమిషన్ ఆదేశించింది. ఈ సందర్భంగా ఆర్‌టీఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ, "సమాచార హక్కు చట్టం ప్రజలకు పారదర్శక పాలనను అందించే శక్తివంతమైన సాధనం. సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా నిలిపివేసే అధికారులపై కమిషన్ చర్యలు అభినందనీయమైనవి" అని అన్నారు. ఈ తీర్పు ద్వారా సమాచార హక్కు చట్టం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలపడుతుందని న్యాయ నిపుణులు, కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

# ఘనంగా గోరింటాకు పండుగ జరుపుకున్న మహిళలు





**నల్లగొండ, జూలై 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్గొండ పట్టణ శివారులోని హ్యాపీ హోమ్స్ లో గురు వారం మహిళలు గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. తొలుత కాలనీకి చెందిన మహిళలందరూ సామూహికంగా చెట్ల నుండి గోరింటాకును తీసుకువచ్చి, గౌరీ దేవి ముందు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీ పూజ అనంతరం సంప్రదాయబద్ధంగా గోరింటాకు నూరి, చేతులపై రకరకాల డిజైన్లలో పెట్టు కున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. ఏ శుభకార్యం జరిగినా గోరింటాకు ను పెట్టుకోకుండా మహిళలు శుభకార్యాలు మొదలు పెట్టరని అన్నారు. గోరింటాకు వల్ల ఎన్నో ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయని, గోరింటాకు చేతులకు పెట్టుకోవడం వల్ల శరీరంలో వేడి తగ్గుతుందని చెప్పారు. అందరం కలిసికట్టుగా ఉండి గోరింటాకు పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే మహిళలకు మానసికంగా ఎంతో ఊరట కలుగుతుందని చెప్పారు. ఆషాడ మాసంలో మహిళలందరూ గోరింటాకు పెట్టుకోవడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తుందని, అదే ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పద్మానాయక్, సుజాత, వసుందర, సరిత, పద్మ, శ్రీలత,, జ్యోతి, సీత, మంగ, రమ, శ్రీలత, శారద, సునంద, మంజుల, అరుణ, నాగమణి, మేఘన, అనూష, రుక్మిణి,శ్వేత, మల్లి,వరలక్ష్మి, వాణి, భవాని, ఇందిరా, కరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం



మాడుగుల, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మాడుగుల మండలంలోని కుభ్యతండ గ్రామపంచాయతీ పరిధిలో యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో ఆర్థోపెడిక్, జనరల్ చెకప్, బీపీ, షుగర్, దంత పరీక్ష, కంటి పరీక్ష వంటి వైద్య సేవలను గ్రామ ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందించారు.హైదరాబాద్ దూర ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేకుండా, గ్రామంలోనే ఈ అవకాశాన్ని కల్పించినందుకు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌డీబీ ఫౌండేషన్ అనిల్ నాయక్ సమన్వయం చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ దేవి దేవరాజ్, ఉప సర్పంచ్ భాష, గ్రామ పెద్దలు పాండు నాయక్, తావు నాయక్, సర్దార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల పోలీసులకు ప్రత్యేక ధ్యాన శిక్షణ



నంద్యాల, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో జిల్లా పోలీసు సిబ్బందికి ప్రత్యేక ధ్యాన శిక్షణ కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ సహకారంతో, రిటైర్డ్ డీజీపీ ఆదిత్య ఆర్య, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆదిత్య ఆర్య మాట్లాడుతూ, “పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవి. నిరంతర ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసులకు ధ్యానం మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ఉత్తమ సాధనం” అని వివరించారు. ప్రతిరోజూ కొద్దిసేపు ధ్యానం చేయడం ద్వారా నిర్ణయ సామర్థ్యం మెరుగుపడుతుందని, కోప నియంత్రణ, భావోద్వేగ సమతుల్యత పెరుగుతాయని తెలిపారు.జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో నేర్చుకున్న ధ్యాన విధానాలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ భాష, ఎఆర్ అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ, ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, శిక్షకులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు: ఎమ్మెల్యే గిత్త

## – నెహ్రూ నగర్ ప్రజల పట్ల ప్రత్యేక దృష్టి





నందికొట్కూరు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న వేళ, ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇంటింటా టీడీపీ అభివృద్ధి పరిచయం కార్యక్రమంలో భాగంగా గురువారం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య నెహ్రూ నగర్ పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మమేకమై, గ్రామంలోని డ్రైనేజీలు, రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. “అధికారులు ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు. సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి” అని ఎమ్మెల్యే హెచ్చరించారు.ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గిపోవడం, రుతుపవనాలు బలహీనపడటం వల్ల తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని ఆయన వివరించారు.ఈ పర్యటనలో పగిడ్యాల మండల కన్వీనర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్



నంద్యాల, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గురువారం ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయ ఆవరణ, పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించి ఎల్లప్పుడూ శుభ్రతను కాపాడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తరువాత రెవెన్యూ పరిపాలన, రీ-సర్వే పెండింగ్ అంశాలు, ప్రజలకు అందిస్తున్న సేవల పురోగతిపై ఆర్డీవో, తహసీల్దార్లు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. “ప్రజలకు సంబంధించిన ప్రతి దరఖాస్తు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పరిష్కరించాలి. బియాండ్ ఎూూ కేసులు ఏవీ ఉండకూడదు. విధుల్లో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వొద్దు” అని ఆయన స్పష్టం చేశారు.రీ-సర్వే పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్డీవో వెంకటశివ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సుల్తాన్‌పూర్ రోడ్డుపై కేజీవీల్ ట్రాక్టర్ పట్టివేత



ఎలిగేడు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):మండలంలోని సుల్తాన్‌పూర్ ఆర్అండ్‌బీ రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా కేజీవీల్ ట్రాక్టర్ నడుపుతున్న వాహనాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు.ఎస్సై మధుకర్ వివరాల ప్రకారం, కానిస్టేబుల్ ఇమ్రోజ్ పెట్రోలింగ్ విధుల్లో ఉండగా, రోడ్డుపై తిరుగుతున్న ట్రాక్టర్‌ను గమనించి అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ కీర్తి రాజేష్తో పాటు టీఎస్04ఈఎఫ్ 2186 నెంబరు గల ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యాకన్నకు అప్పగించారు. ఎస్సై మధుకర్ మాట్లాడుతూ, “కేజీవీల్ (ఇనుప చక్రాలు)తో ట్రాక్టర్ లేదా ఇతర వాహనాలను రహదారులపై నడిపితే కఠిన చర్యలు తప్పవు” అని హెచ్చరించారు.

# ప్రజల రక్షణకు ప్రైవేట్ ఫైనాన్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి




నందికొట్కూరు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):ప్రైవేట్ ఫైనాన్స్, డైలీ ఫైనాన్స్, ఈఎంఐ రుణాల వసూళ్లలో చట్టవిరుద్ధమైన ఒత్తిళ్లు, వేధింపులు అరికట్టాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో బేస్తవాం ం నాడు రూరల్ సీఐ సుబ్రహ్మ ణ్యంకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, “నాలుగు మండలాల్లో ఉన్న ప్రైవేట్ ఫైనాన్స్ బ్యాంకు మేనేజర్ల సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రుణగ్రస్తులపై దాడులు చేయరాదని హెచ్చరిస్తాం” అని తెలిపారు.లి బరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, “పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులు, కూలీలు, చిరు ఉపాధి పొందుతున్న ప్రజలు అత్యవసర అవసరాల కోసం ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. కానీ వసూళ్ల పేరుతో బెదిరింపులు, అవమానాలు, మానసిక వేధింపులు జరగకూడదు. ప్రజల ప్రాణాలు, గౌరవం కంటే ఏ ఆర్థిక లావాదేవీ గొప్పది కాదు” అని పేర్కొన్నారు.మల్యాల గ్రామంలో జరిగిన విషాద ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, రుణ వసూళ్లలో చట్టవిరుద్ధమైన చర్యలు జరిగితే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫైనాన్స్ సంస్థలు, రికవరీ సిబ్బంది చట్టబద్ధమైన విధానాలనే పాటించేలా అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కాటేపోగు సోమన్న, వడ్డే సుధాకర్, ఎస్. షరీఫ్, మాధవ నాయుడు, ఎం. చంద్రశేఖర్, మహి ళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. బేబీ, అధ్యక్షురాలు బి. లక్ష్మీదేవి, వి. రేణుక, వెంకట లక్ష్మమ్మ, వి. మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో హైకోర్టు బెంచ్ రాక పట్ల న్యాయవాదుల సంబరాలు



నందికొట్కూరు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కర్నూలు పట్టణంలోని జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో 90 రోజుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై న్యాయవాదులు ఆనందోత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. భారీ కేక్ కట్ చేసి, ఒకరికి ఒకరు తినిపించుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఏపీ ఈడబ్ల్యూఐడిసి రాష్ట్ర డైరెక్టర్ జి. నాగముని మాట్లాడుతూ, “90 రోజుల్లో హైకోర్టు బెంచ్ ఏర్పడుతుందని మంత్రి నారా లోకేశ్ ప్రకటించడం గొప్ప విషయం” అని అభినందించారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాబు, పరిశ్రమల శాఖ మంత్రి టి.జీ. భరత్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశా రు. నాగముని మాట్లాడుతూ, ఉమ్మడి కర్నూలు జిల్లాలో నిర్వహించిన యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ గుర్తుంచుకుని, వాటిని నెరవేర్చేందుకు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. రాయలసీమలో పరిశ్రమలు, ఉద్యానహబ్, రాయల్ ఎన్ఫీల్డ్, యుద్ధవిమానాల తయారీ కేంద్రం వంటి అభివృద్ధి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వ హయాంలోనే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్ దాశెట్టి, శ్రీనివాసులు, మోహన్ బాబు, బడేసాబ్, మద్దెన్, గోవిందు, మురళి నాయుడు, బి. చంద్రుడు, బి.ఎస్. రవికాంత్ ప్రసాద్, పి. రవి గుణేరా, రంగా రవికుమార్, శ్రీనివాస్ బట్, ఏ. మాదన్న సింగ్, సీనియర్, జూనియర్ నాయకులు గణేష్ సింగ్, ఈ. రాజేష్, జహంగీర్ భాష, మహిళా న్యాయవాదులు జయలక్ష్మి, కరుణ జ్యోతి, సుమన రాణితో పాటు జనసేన, బిజెపి, టిడిపి న్యాయవాదులు పాల్గొన్నారు.

# బిలకలగూడూరులో టిడిపి ఇంటింటా ప్రచారం ప్రజల అనూహ్య స్పందన



గడివేముల, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గడివేముల మండలంలోని బిలకలగూడూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు, పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ఆదేశాల మేరకు మండల తెదేపా ప్రధాన కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్ (వలి) ఆధ్వర్యంలో ఇంటింటా టిడిపి అభివృద్ధి పరిచయం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బూత్ నెంబర్ 326 పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా అని తెలుసుకున్నారు.ప్రధాన కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ, “ప్రజలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారు. కూటమి ప్రభు త్వం చేస్తున్న అభివృద్ధి పట్ల సంతోషంగా ఉన్నారు” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో షఫీ షేక్ ముజ్బుల్, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పేరిట ఒక మొక్క



దేవరకొండ, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన “మాకె నామ్ ఫర్ ఏక్ పేడ్” (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా దేవరకొండ పట్టణంలోని మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ, “తల్లికి గౌరవం, పర్యావరణానికి రక్షణ -- ప్రతి ఒక్కరూ తమ తల్లి జ్ఞాపకార్థంగా ఒక మొక్కను నాటాలి. పర్యావ రణాన్ని కాపాడడంలో యువత ముందుండాలి” అని సూచించారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి. లింగారెడ్డి, డాక్టర్ వి. మకట్లాల్, ఎన్‌సిసి క్యాడెట్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణుల సమస్యలు తీర్చాలని సంఘ రాష్ట్ర అధ్యక్షులను కలిసిన వినతి పత్రం సమర్పించిన బ్రాహ్మణ సంఘం నాయకులు



నల్లగొండ, జులై 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్): గురువారం అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు శ్రీ బసవరాజ్ శ్రీనివాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి అదేవిధంగా కొన్ని సంవత్సరాలుగా బ్రాహ్మణ పరిషత్ నుండి లోన్స్ కోసం వేచి చూసే పేద బ్రాహ్మణులకు లోన్స్ వచ్చే విధంగా చూడాలని అదేవిధంగా విదేశీ విద్య కోసం బ్రాహ్మణులు వెళ్లి వాళ్లకు రావాల్సిన లోన్లు రాక బ్యాంకుల వేసే ఇంట్రెస్టులు తట్టుకోలేక చాలా ఇబ్బంది పడుతున్నారని తెలియజేయడం జరుగింది వారు కూడా స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి తొందరగా రుణాలు బ్రాహ్మణులకు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అఖిల బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లా వేణుగోపాల్ రావు, ఉపాధ్యక్షులు రంగరాజు శ్రీనివాసరావు , కొప్పోలు నవీన్ శర్మ ,కొలనుపాక అనంతపద్మనాభ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు 33% రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలి



నల్లగొండ, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది.ఈ మేరకు నల్లగొండ బస్టాండ్‌లో ఐద్వా ఆధ్వర్యంలో ప్రజల నుంచి విస్తృతంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ, “హామీలు కాదు... హక్కులు కావాలి. మహిళల రాజకీయ భాగస్వామ్యమే ప్రజాస్వామ్య బలోపేతం” అని పేర్కొన్నారు.చట్టం ఆమోదించి అమలు చేయకపోవడం మహిళలను మోసం చేయడమేనని ఆమె విమర్శించారు. మహిళలకు న్యాయం చేయాలంటే రిజర్వేషన్‌ను ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిట్టా సరోజ, జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన, కమిటీ సభ్యులు కౌసల్య, సైదమ్మ, కళమ్మ, అనిత, పద్మ, కోటమ్మ, యశోద, అశ్విని, మలలేశ్వరి, దుర్గాబాయి తదితర మహిళలు పాల్గొన్నారు.

# పౌరహక్కులపై అవగాహన అవసరం



ఎలిగేడు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్య తలను తెలుసుకుని సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని తహసీల్దార్ యాకన్న సూచిం చారు .ఎలిగేడు మండల కేంద్రంలోని జీపీ కారా ్యలయం ఆవరణలో గురువారం సర్పంచ్ కప్పల ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, “కులవివక్షత చూపరాదు. ఎవరు వివక్షతకు గురైతే వెంటనే అధికా రుల దృష్టికి తీసుకురావాలి. అంటరానితనం నేరం, సమాజంలో అందరూ సమానులే” అని స్పష్టం చేశారు.ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్యను అంది స్తోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు, సమాన త్వం, సామాజిక న్యాయం, చట్టపరమైన హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, సోషియల్ వెల్ఫేర్ అధికారి ఆంజనేయులు, ఎస్సై మధుకర్, ఆర్ఐ జయలక్ష్మి, జీపీవో అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అంజలి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వర్షాలతో జలకళ రోడ్డుపై ప్రవహిస్తున్న వాగు



ఎలిగేడు, జూలై 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గత రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లో నీరు చేరి జలకళ సంతరించుకున్నాయి. ధూళికట్ట--వడుకాపూర్ గ్రామాల మధ్యనున్న హుస్సేని మియా వాగు రోడ్డుపై ప్రవహించడంతో తహసీల్దార్ యాకన్న, సర్పంచ్ కొమురయ్యలు పరిశీలించారు.రోడ్డుపై వరదనీరు ప్రమాదకరంగా ఉండటంతో అడ్డంగా ముళ్లకంపలు వేసి, నీరు తగ్గే వరకు ఎవరూ రోడ్డుపై వెళ్లవద్దని అధికారులు సూచించా రు.వర్షాలు ఏకదాటిగా కురుస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరు వులు, వాగులు నిండిపోవడం పంటలకు ఊరటనిచ్చే సూచనలుగా రైతులు భావిస్తున్నారు.

# ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్

చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు జాక్‌పాట్ తగిలింది. తంతే బూరెల బుట్టలో పడ్డట్టు.. ఏకంగా ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ పదవి వరించింది. 18 ఏళ్ల తర్వాత ఫ్లెమింగ్‌పై సీఎస్‌కే వేటు వేగయా.. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు.. హెడ్ కోచ్‌గా స్వాగతం పలికింది. ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ సారథిగా తిరిగి జోరూట్‌ను ఎంపిక చేసింది.బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికడంతో అనుభవం కలిగిన జోరూట్‌కే ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) మళ్లీ సారథ్య బాధ్యతలు కట్టబెట్టింది. బ్రెండన్ మెక్‌కల్లమ్ స్థానంలో స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్ట్ టీమ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు ఈసీబీ గురువారం ఒక ప్రకటనను విడుదల చేసింది. స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ బోర్డు ప్యానెల్ ఏకగ్రీవంగా ఆమోదించిందని పేర్కొంది. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన కోచ్‌ల్లో ఒకరైన ఫ్లెమింగ్ రాకతో టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు ఒక కొత్త శకం మొదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంగ్లండ్ టెస్ట్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని ఫ్లెమింగ్ తెలిపాడు. 'టెస్ట్ కోచ్‌గా ఇంగ్లండ్ జట్టులో చేరబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కోచింగ్ పదవుల్లో ఇది ఒకటి. అలాంటి పదవి బాధ్యతలను చేపట్టడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ఆటగాళ్లతో పని చేయడానికి, బ్రెండన్ మెక్‌కల్లమ్, బెన్ స్టోక్స్ సాధించిన ప్రగతిని



కొనసాగించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక ప్రణాళికలతో జట్టుకు విజయాలను అందించే ప్రయత్నం చేస్తాం. జట్టులోని యువ ప్రతిభావంతులకు సాయం చేయడమే మా ప్రధాన లక్ష్యం.'అని ఫ్లెమింగ్ చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ అయిన స్టీఫెన్ ఫ్లెమింగ్.. చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల సేవలందించాడు. ఈ 18 సంవత్సరాల్లో 10 సార్లు జట్టును ఫైనల్‌కు చేర్చడంతో పాటు ఐదు టైటిళు అందించాడు. సీఎస్‌కేకు చెందిన ఇతర గ్లోబల్ ఫ్రాంచైజీలకు కూడా కోచ్‌గా సేవలందించాడు. న్యూజిలాండ్ కెప్టెన్‌గా 80 మ్యాచ్‌ల్లో 28 విజయాలు అందించాడు. కౌంటీ క్రికెట్‌లో నాటింగమ్‌షైర్ జట్టుకు సారథిగా వ్యవహరించి 2005 కౌంటీ ఛాంపియన్‌షిప్ టైటిల్ అందించాడు. 2017 నుంచి 2022 వరకు కెప్టెన్‌గా కొనసాగిన జోరూట్ తిరిగి సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యాడు. గతంలో 64 టెస్ట్‌ల్లో జోరూట్ 27 విజయాలు అందించాడు. ఇంగ్లండ్ సారథ్య బాధ్యతలను తిరిగి చేపట్టడం గర్వంగా ఉందని జోరూట్ తెలిపాడు. ఈ బాధ్యతల్లో కొనసాగడం ఎంతో కష్టమైనప్పటికీ.. సంతృప్తినిస్తోందని చెప్పాడు. స్టీఫెన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని వెల్లడించాడు.

# భారత హాకీ కిట్ కలర్ మార్పుపై రచ్చ!

భారత హాకీ జట్ల జెర్సీ రంగును బ్లూ నుంచి కాషాయ రంగుకు (ఆరెంజ్) మార్చడంపై మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హాకీ ఇండియా స్పష్టం చేసింది. వచ్చే నెలలో బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగనున్న ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ 2026 కోసం భారత పురుషుల, మహిళల జట్లు సిద్ధమవుతున్నాయి. ఈ మెగా టోర్నీ కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) జాతీయ జట్ల జెర్సీ రంగును అనూహ్యంగా మార్చేసింది. దశాబ్దాలుగా భారత జట్టుకు ఐడెంటిటీగా ఉన్న సంప్రదాయ బ్లూ జెర్సీ స్థానంలో కొత్తగా కాషాయం (ఆరెంజ్) రంగు కిట్‌ను పరిచయం చేసింది. ఈ నిర్ణయంపై భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జెర్సీ రంగు మార్చడం వెనుక ఉన్న లాజిక్ ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ రంగు మార్పుపై సోషల్ మీడియాలో సైతం పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా సీనియర్ అధికారి ఒకరు.. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని కొట్టిపారేశారు. జాతీయ జెండాలో కాషాయం ఒక భాగమని, మార్పును ఎప్పుడూ స్వాగతించాలని ఆయన సూచించారు. సంప్రదాయ బ్లూ జెర్సీని మార్చడానికి



ప్రధాన కారణం ఆటగాళ్ల విజిబిలిటీ అని ఆ అధికారి వివరించినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు ఎక్కువగా బ్లూ టర్ఫ్ (మైదానం) పైనే జరుగుతున్నాయి. మైదానం రంగు, జెర్సీ రంగు ఒకేలా ఉండటం వల్ల ఆటగాళ్లను గుర్తించడం వీక్షకులకు కష్టంగా మారుతోంది. ఆరెంజ్ రంగు వల్ల కాంట్రాస్ట్ పెరిగి, టర్ఫ్‌పై ఆటగాళ్లు స్పష్టంగా కనిపిస్తారని ఆయన పేర్కొన్నారు. కొత్త కిట్‌ను ఆవిష్కరిస్తూ హాకీ ఇండియా ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ఆసక్తికరమైన పోస్ట్ చేసింది. జెర్సీలోని ప్రతి కుట్టు ఒక కథను చెబుతుందని, ప్రతి రంగు దేశ గర్వాన్ని చాటుతుందని పేర్కొంది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయాలకు ప్రతీక అని వెల్లడించింది. ఉదయిస్తున్న సూర్యుడి స్ఫూర్తితో రూపొందించిన ఈ డిజైన్ సరికొత్త ఆరంభానికి సంకేతమని వివరించింది. ఇందులో తెలుపు రంగు ప్రత్యామ్నాయ జెర్సీలు కూడా ఉంటాయి. జెర్సీ మార్పు నిర్ణయం తనకు ఎంతో ఇబ్బందికరంగా అనిపించిందని వీరేన్ రస్కిన్హా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత జట్టు వారసత్వం, గుర్తింపు ఎప్పుడూ 'బ్లూ' రంగుతోనే ముడిపడి ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ఎన్నో ఏళ్ల పాటు గర్వంగా బ్లూ జెర్సీ ధరించానని, అభిమానులు కూడా మన జట్టును ఆ రంగులోనే చూడాలని కోరుకుంటారని అభిప్రాయపడ్డారు. తన వాదన కేవలం జాతీయ జట్టు గుర్తింపు, వారసత్వం గురించేనని రస్కిన్హా స్పష్టం చేశారు.



# అంతర్జాతీయ క్రికెట్‌కు అజింక్య రహానే గుడ్‌బై..

భారత స్టార్ బ్యాటర్, మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతూ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నాడు. టీమిండియా మాజీ వైస్ కెప్టెన్, క్లాసిక్ బ్యాటర్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలుకుతూ గురువారం సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ వీడియో ద్వారా రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. జీవితంలో సరైన సమయం వచ్చినప్పుడు దాన్ని గౌరవించి ముందుకు సాగక తప్పదని ఈ సందర్భంగా అతడు ఉద్వేగభరితంగా పేర్కొన్నాడు. తనకు అండగా నిలిచిన బీసీసీఐకి, తన తోటి ఆటగాళ్లకు, కోచ్‌లకు, కోట్లాది మంది అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. 2011లో ఇంగ్లండ్‌పై టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన రహానే, ఆ తర్వాత కొన్ని రోజులకే రాహుల్ ద్రావిడ్ ఫేర్‌వెల్ సిరీస్‌లో వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇక 2013లో ఢిల్లీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. విరాట్ కోహ్లీ, పుజారాలతో కలిసి మిడిలార్డర్‌లో భారత జట్టుకు బలమైన వెన్నెముకగా నిలిచాడు. కఠినమైన విదేశీ పిచ్‌లపై అతడు ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆస్ట్రేలియా గడ్డపై 2020-21 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును ముందుండి నడిపించిన తీరు అతడి కెరీర్‌లోనే ఒక సువర్ణాధ్యాయం. కోహ్లీ గైర్హాజరీలో జట్టు బాధ్యతలు చేపట్టి, యువ ఆటగాళ్లతో అద్భుతాలు సృష్టించాడు. మెల్‌బోర్న్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి జట్టుకు చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందించాడు. ఆ సిరీస్ అతడి నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి చాటిచెప్పింది. భారత్ తరఫున 85 టెస్టులు ఆడిన రహానే 5077 పరుగులు సాధించాడు. అలాగే 90 వన్డేల్లో 2962 పరుగులు, 20 టీ20 మ్యాచుల్లో 375 పరుగులు తన ఖాతాలో వేసుకున్నాడు. జులై 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచే అతడి కెరీర్‌లో ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, ఐపీఎల్ లాంటి ఫ్రాంచైజీ లీగ్స్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో తాను కొనసాగుతానని రహానే స్పష్టం చేశాడు. ఈ ఏడాది ఐపీఎల్ 2026లో కూడా అతడు ఆడాడు. పదేళ్లకు పైగా తన అద్భుత ఆటతో కోట్లాది మంది మనసులు గెలుచుకున్న ఈ సైలెంట్ వారియర్ రిటైర్మెంట్ వార్త అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది.

# లాంగ్ జంప్‌లో శ్రీశంకర్‌కు సిల్వర్



- పారా అథ్లెటిక్స్‌లో డబుల్ డిలైట్
- 2026 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలు

**గ్లాస్గో (స్కాట్లాండ్):** 2026 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు మరో పతకం లభించింది. కేరళ అథ్లెట్ మురళీ శ్రీశంకర్ లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్‌తో మెరిశాడు. బుధవారం అర్ధరాత్రి అనంతరం జరిగిన పురుషుల లాంగ్ జంప్ ఫైనల్లో శ్రీశంకర్ 8.09 మీటర్ల జంప్‌తో ద్వితీయ స్థానంలో నిలిచాడు. భారత్‌కు చెందిన మరో అథ్లెట్ లోకేశ్ సత్యనాథన్ 7.97 మీటర్ల జంప్‌తో ఐదో స్థానంలో నిలిచి పతకానికి దూరమయ్యాడు. 2022 బర్మింగ్‌హామ్‌లో తొలిసారి బరిలోకి దిగి పతకం సాధించిన మురళీ శ్రీశంకర్.. కామన్‌వెల్త్ క్రీడల్లో వరుసగా రెండో మెడల్ సాధించాడు. జమైకా అథ్లెట్, మాజీ ప్రపంచ చాంపియన్ తజల్ గేల్ 8.15 మీటర్లలో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకం సొంతం చేసుకున్నాడు. 8.08 మీటర్ల జంప్‌తో స్కాట్లాండ్‌కు చెందిన స్టిఫెన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఫైనల్లో తొలి ప్రయత్నంలో 8.03 మీటర్ల జంప్ చేసిన మురళీ శ్రీశంకర్.. రెండో ప్రయత్నంలోనే 8.09 మీటర్ల పతక జంప్ చేశాడు. ఆ తర్వాత వరుసగా రెండు ప్రయత్నాలు ఫౌల్ కాగా.. చివరి రెండు ప్రయత్నాల్లో 7.94మీటర్లు, 7.97 మీటర్ల జంప్‌తో సరిపెట్టాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించినా గాయంతో దూరమైన మురళీ శ్రీశంకర్ తాజాగా గ్లాస్గోలో కామన్‌వెల్త్ క్రీడల సిల్వర్ మెడల్‌తో తనేంటో నిరూపించుకున్నాడు. ఇదిలా ఉండగా, భారత పారా అథ్లెట్లు ఒకే ఈవెంట్లో రెండు పతకాలు సాధించారు. పురుషుల 100 మీటర్ల టీ47 ఫైనల్లో దిలీప్ గవిట్, మహ్మద్ బసిల్‌లు సత్తా చాటారు. 10.71 సెకండ్లలో రేసును ముగించిన దిలీప్ బంగారు పతకం సాధించగా, 10.83 సెకండ్లతో మహ్మద్ బసిల్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఇక మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో జాతీయ రికార్డు బద్దలుకొట్టిన పారుల్ చౌదరి 9.26.75 టైమింగ్‌తో ఐదో స్థానానికి పరిమితమై పతకం చేజార్చుకుంది.

# ఫైనల్‌లోకి దూసుకెళ్లిన నీరజ్ చోప్రా



స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్ ఎనిమిదో రోజు పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. భారత అథ్లెటిక్స్ జట్టుకు శుభవార్తగా, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. అతనితో పాటు భారత అథ్లెట్లు యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ కూడా ఫైనల్‌లోకి ప్రవేశించారు. దీంతో జావెలిన్ త్రో విభాగంలో భారత్‌కు పతక అవకాశాలు మరింత బలపడ్డాయి. ఈ విభాగానికి సంబంధించిన పతకాల పోటీలు జూలై 31న జరగనున్నాయి. ప్రస్తుతం కామన్వెల్త్ గేమ్స్‌లో అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, బాల్స్ పోటీలు కొనసాగుతుండగా, ట్రాక్ సైక్లింగ్‌లో కూడా భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. భారత క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు జావెలిన్ త్రో ఫైనల్‌పై కేంద్రీకృతమైంది. స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుడిగా భావిస్తున్న నీరజ్ చోప్రా క్వాలిఫికేషన్ రౌండ్‌లో అంచనాలకు తగ్గ ప్రదర్శన చేయకపోయినా, ఫైనల్‌లోకి సులభంగా అర్హత సాధించాడు. జావెలిన్ త్రోలో నేరుగా ఫైనల్‌కు చేరాలంటే 85 మీటర్ల క్వాలిఫికేషన్ మార్క్‌ను అధిగమించాల్సి ఉంటుంది. అయితే తొలి ప్రయత్నంలో నీరజ్ 76.28 మీటర్లు మాత్రమే విసరగలిగాడు. దీంతో నేరుగా అర్హత సాధించే మార్క్‌ను అందుకోలేకపోయాడు. అయితే రెండో ప్రయత్నంలో తన ప్రదర్శనను మెరుగుపరుచుకున్న నీరజ్ 79.61 మీటర్లు జావెలిన్ విసిరి మొత్తం ఫలితాల్లో ఐదో స్థానంలో నిలిచాడు. దీంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. భారత జట్టుకు చెందిన మరో ఇద్దరు జావెలిన్ త్రోయర్లు కూడా మంచి ప్రదర్శన కనబరిచారు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు, యశ్‌వీర్ సింగ్ 74.45 మీటర్లు నమోదు చేసి ఇద్దరూ ఫైనల్‌లో చోటు దక్కించుకున్నారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో పాకిస్థాన్ ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్ తొలి ప్రయత్నంలోనే విఫలమవడం ఆసక్తికరంగా మారింది. అనంతరం మూడు ప్రయత్నాలు పూర్తి చేసిన అతను గరిష్టంగా 78.63 మీటర్లు మాత్రమే నమోదు చేశాడు. ఫైనల్‌లో నీరజ్ చోప్రాకు అర్షద్ నదీమ్‌తో పాటు శ్రీలంకకు చెందిన యువ ప్రపంచ ఛాంపియన్ రుమేష్ పతిరాగేల నుంచి గట్టి సవాల్ ఎదురుకానుంది. ఈ ముగ్గురు మధ్య స్వర్ణ పతక పోరు ఉత్కంఠభరితంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు మహిళల 4000 మీటర్ల క్వాలిఫికేషన్ రేసులో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత అథ్లెట్ లీషా దాస్ 6:58.000 నిమిషాల్లో రేసును పూర్తి చేసినప్పటికీ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇంగ్లాండ్‌కు చెందిన మోర్గాన్ న్యూబెర్రీ కంటే ఆమె 1 నిమిషం 51 సెకన్లు వెనుకబడటంతో ఐదో స్థానానికి పరిమితమైంది. ఆస్ట్రేలియాకు చెందిన ఎరిన్ నార్మోయిల్ (5:24.264), ఇంగ్లాండ్‌కు చెందిన కదీనా కాక్స్ (6:37.119) ప్రదర్శనల నేపథ్యంలో లీషా ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. ఇదిలా ఉండగా, కామన్వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారులకు బుధవారం చారిత్రాత్మక రోజుగా నిలిచింది. భారత బాక్సర్లు ఏకంగా 10 పతకాలను ఖాయం చేయగా, లాంగ్ జంప్ స్టార్ మురళీ శ్రీశంకర్ కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో వరుసగా రెండు పతకాలు గెలిచిన తొలి భారత లాంగ్ జంపర్‌గా రికార్డు సృష్టించాడు.

# రామాయణ ట్రైలర్ విడుదల




## - అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ-రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది.

# మరో లవ్ గ్రాక్ మూవీ శ్రీనివాస మంగాపురం

## - ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన




ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు.

# నవ్వుతో కట్టిపడేస్తున్న ప్రగ్యా జైశ్వాల్..

**కంచె, అఖండ, అఖండ 2, డాకు మహారాజ్ సినిమాలతో తెలుగులోమంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది ప్రగ్యా జైశ్వాల్. ఈ జబల్ పూర్ బ్యూటీ నెట్టింట యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్లలో జోష్ నింపుతుంటుంది. సోషల్ మీడియాలో తనకు సంబంధించిన అప్‌డేట్స్‌ను షేర్ చేసుకునే ప్రగ్యాజైశ్వాల్ తాజాగా పోస్ట్ చేసిన ఫొటోలు కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.ప్రగ్యాజైశ్వాల్ సెలబ్రిటీ, ఫ్యాషన్ స్టైలిస్ట్ నటాషా బోత్రా అండ్ టీం డిజైన్ చేసిన ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో హొయలు పోయింది. బ్లూ అండ్ వైట్ చారలతో డిజైన్ చేసిన డ్రెస్‌లో చిరునవ్వులు చిందిస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'చారలు తిరిగి వచ్చాయని విన్నా..' అంటూ ఈ స్టిల్స్‌కు క్యాప్షన్ ఇచ్చింది.చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా ఉన్న ప్రగ్యాజైశ్వాల్ స్టిల్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న టైసన్ నాయుడులో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది ప్రగ్యాజైశ్వాల్.**



# విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2



అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు టా÷-గ్గ÷ట్ చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది

# సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం




తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బిహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

# లెనిన్ సరికొత్త రికార్డులు

## - వందకోట్ల క్లబ్బులో అఖిల్ లెనిన్ చేరిక

టాలీవుడ్ యువ సామ్రాట్ అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఓ సరికొత్త చరిత్రాత్మక అధ్యాయం మొదలైంది. ఆయన నటించిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు సృష్టిస్తూ, ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్ల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. దీంతో అఖిల్ కెరీర్‌లో తొలి బ్లాక్ బస్టర్‌ను నమోదు చేయడంతో పాటు తొలి రూ.100 కోట్ల సినిమాగా రికార్డుల కెక్కింది. జూలై 10న భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. దర్శకుడు మురళి కిషోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమాలో అఖిల్ కొత్త మేకోవర్, పవర్ ప్యాక్డ్ మాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు, హై-ఓల్టేజ్ ఎమోషనల్ సన్నివేశాలు థియేటర్లలో ప్రేక్షకులను కట్టిపడేశాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించాయి. నిర్మాత నాగవంశీ, నాగార్జున అనుసరించిన పబ్లిసిటీ వ్యూహాలు సినిమా విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఇక తమ అభిమాన హీరో అఖిల్ ఖాతాలో తొలి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ కూడా సంతోషం వ్యక్తం చేస్తూ ప్రేక్షకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

